● జై బోలో గణేశ్ మహారాజ్‌కీ..




వినాయక చవితి సందర్భంగా జిల్లా కేంద్రం సావర్కర్ నగర్‌లో కొలువుదీరిన గణనాథుడు

సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు
లైన్‌క్లియర్!

సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు లైన్‌క్లియర్ అయింది. సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులపై హైకోర్టు విధించిన స్టేను తాజాగా ఎత్తివేసింది. భూభారతి చట్టం ప్రకారం సాదాబైనామా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సూచించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- స్టే ఎత్తివేసిన హైకోర్టు
- భూభారతిచట్టం ద్వారా రిజిస్ట్రేషన్లు
- విధివిధానాలు వచ్చాక ప్రక్రియ షురూ
- ఉమ్మడి జిల్లాలో 1.60లక్షలకు పైగా దరఖాస్తులు



జిల్లా	రెవెన్యూ గ్రామాలు	సాదాబైనామా దరఖాస్తులు
నల్లగొండ	565	82,134
సూర్యాపేట	486	45,219
యాదాద్రి	321	32,910
మొత్తం	1,372	1,60,263

భూభారతి చట్టంలోని సెక్షన్-6 ప్రకారం సాదాబైనామాలకు రిజిస్ట్రేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి దాఖలైందని కోర్టు స్పష్టం చేయడంతో ఇక వీటి రిజిస్ట్రేషన్లు ఊపందుకోనున్నాయి. కోర్టు కేసు తేలిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు 9,26,000 సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని, అర్హులైనవారికి పట్టాలు సైతం అందిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలోనే ప్రకటించారు. తాజాగా, కోర్టు తీర్పు అందుకు అనుకూలంగా రావడంతో సా దాబైనామాల దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భూమి మోఖాపై ఉన్న ప్రతీ రైతుకు, న్యాయబద్ధంగా సాదాబైనామా ఉంటే పట్టా ఇస్తామని ప్రభుత్వం స్పష్టంగా తేల్చిచెప్పింది.

ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు

గ్రామీణ ప్రాంత భూముల వివాదాల్లో కీలకమైన సాదాబైనామా రిజిస్ట్రేషన్లకూ తాజాగా కోర్టు తీర్పుతో మోక్షం కలగనుంది. వాస్తవానికి భూభారతి అమల్లోకి వచ్చిన వెంటనే ఆర్డీవోల ద్వారా సాదాబైనామాల పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమయినా కోర్టులో స్టే ఉండడంతో దరఖాస్తులు మాత్రమే స్వీకరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ధరణి చట్టం అమల్లోకి తెచ్చే క్రమంలో సాదాబైనామాలకు అవకాశం కల్పిస్తూ దరఖాస్తులు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ తేదీ జూన్ 2కి ముందు 12ఏళ్ల పాటు భూమిపై మోఖాలో ఉండి, పట్టాలేని రైతులు సాదాబైనామాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అప్పట్లో సూచించారు. 2020, అక్టోబరు 12 నుంచి 2020, నవంబరు 11 వరకు సాదాబైనామాల రిజిస్ట్రేషన్ల నిమిత్తం దరఖాస్తులు తీసుకున్నారు. అప్పుడు 2002 నుంచి 2014 వరకు సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన చిన్న, సన్నకారు రైతులంతా దరఖాస్తు చేసుకున్నారు. ధరణి చట్టం ద్వారానే వీరికి పట్టాలివ్వాలని భావించినా అప్పటి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా, భూభారతి అమల్లోకి తెచ్చేసమయంలోనూ సాదాబైనామాలపై రైతుల నుంచి భారీగా విజ్ఞప్తులు రావడం, రెవెన్యూరంగ నిపుణులు, రిటైర్డ్ అధికారులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులకు సాదాబైనామాల రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఇబ్బందులు

– మిగతా 6వ పేజీలో...

● పొంగిపొర్లిన చెరువులు



శాలిగౌరారం-ఊట్కూరు గ్రామాల మధ్య కాజ్‌వేపై ప్రమాదభరితంగా ప్రవహిస్తున్న వరద 8

కుర్చీలో కూర్చునేదెట్లా?

- పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీకాలం పెంపునకు బ్రేక్
- సొసైటీ ఛైర్మన్ల చెక్‌పవర్ సైతం నిలిపివేత
- ఒక్క డీసీసీబీ ఛైర్మన్ కుంభంకే ప్రభుత్వం అనుమతి
- సొసైటీల్లో సీఈవోల బదిలీలపైనా గందరగోళం

నల్లగొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల గడువుపై ప్రభుత్వం విచిత్ర జీవోను జారీ చేసింది. ఈనెల 14వ తేదీతో పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీకాలంతో పాటు డీసీసీబీల పాలకవర్గాల గడువును ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం జీవో 386, జీవో 74ను విడుదల చేసింది. దీని ప్రకారం మరో ఆరు నెలల పాటు గడువు పెరిగిందని పీఏసీఎస్ ఛైర్మన్లు, డీసీసీబీ డైరెక్టర్లు భావించారు. విచిత్రంగా పీఏసీఎస్ ఛైర్మన్ల గడువు పెంపుపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఈ మేరకు సొసైటీల గడువు పెంచకుండా జిల్లా సహకార అధికారులను నిలువరించింది. అయితే రాష్ట్రంలోని మిగతా డీసీసీబీ ఛైర్మన్లతో పాటు ఉమ్మడి జిల్లా ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే ఛైర్మన్‌గా కొనసాగేలా అనుమతి ఇచ్చింది.



ఉమ్మడిజిల్లాలోని 108పీఏసీఎస్‌లలో 107పీఏసీఎస్ ఛైర్మన్లతోపాటు ఆయా పాలకవర్గాల సభ్యుల పదవీకాలం పొడిగించలేదు. డీసీసీబీ ఛైర్మన్‌గా కొనసాగుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైన పీఏసీఎస్‌కు గడువు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వగా,మిగతా పీఏసీఎస్‌ల ఛైర్మన్లు, సభ్యుల పదవుల గడువు పెం పును నిలిపివేశారు.దీంతో గందగోళ పరిస్థితులు నెలకొన్నాయి.డీసీసీబీలో ఒక్కఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే ఉండటానికి ఉత్తర్వులు ఉండగా, 17మంది డీసీసీబీ డైరెక్టర్‌లతో పాటు మరో ఇద్దరు ప్రొఫెషనల్ డైరెక్టర్లు పదవులు లేనట్టే. ప్రస్తుత నిబంధనల మేరకు వారంతా మాజీలుగానే మిగిలారు.

చెక్ పవర్ నిలిపివేత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునుగోడు సొసైటీ మినహా మిగతా 107 సొసైటీల ఛైర్మన్లను మాజీలుగా భావిస్తూ వారి చెక్ పవర్‌లను ప్రభుత్వం నిలిపివేసింది. పదవీకాలం పెంపును నిలిపివేసిన విషయం ఆయా సొసైటీల ఛైర్మన్లు గోప్యంగా ఉంచుతూ ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్టు తెలిసింది. అయితే జిల్లా సహకార అధికారి మాత్రం ప్రభుత్వం ఆదేశాల మేరకు వారి చెక్‌పవర్‌ను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల పాలకవర్గాన్ని పెంచకుండా నిలిపివేయడానికి కారణాలు ఏమిటనేది తెలియక ఛైర్మన్లు గందరగోళంలోపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి

– మిగతా 6వ పేజీలో...

అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా లావణ్యరాణి



బాధ్యతలు స్వీకరించిన జడ్జి లావణ్యరాణికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఎం.లావణ్యరాణి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆమెకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సాయికుమార్, కర్ణం లింగయ్య, గంగాభవాని, సుండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులతో గౌరవంగా మెలగాలన్నారు. కుక్క, పాము కాటుకు ఇచ్చే మందులను పరిశీలించారు. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించి రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి, కేస రవి, మండల వైద్యాధికారులు శ్రీదేవి ఇక్బాల్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ అమరుల స్ఫూర్తితో పోరాటాలు



విద్యుత్ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. గురువారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో విద్యుత్ పోరాట అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచగా, వాటిని ఉపసంహరించుకోవాలని చేసిన పోరాటంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ పోరాట పర్యవసాన మే ఆ తరువాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్‌ను ప్రకటించిందన్నారు. ప్రజా పోరాటాలను అణచాలనుకున్న ప్రభుత్వాలు అంతమవుతాయని అన్నారు. నాటి అమరుల స్ఫూర్తితో నేడు విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్రం ఆధీనంలోకి తీసుకోవాలని చేస్తున్న ప్రయత్నాలను సంఘటితంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుచ్చకాయల నర్సిరెడ్డి, మల్లం మహేష్, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, గాదె నరసింహ, గుండాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోలు పాఠశాలల తనిఖీని పెంచాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల తనిఖీల సంఖ్య పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఎంఈవోలు పాఠశాలలను తనిఖీచేస్తూ విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మంజూరైన పనుల పురోగతిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు.



జ్యోతిని వెలిగించి క్రీడోత్సవ రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డేటా సేకరణలో వేగం పెంచాలి

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం డేటా సేకరణ, దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. 2017 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 33,600 మరణాలు సంభవించగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి 3,121దరఖాస్తులు వచ్చాయన్నారు. చండూరు డివిజన్‌లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని అధికారులను అభినందించారు.

క్రీడలపై ఆసక్తి కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కల్చరల్): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తిని లక్ష్మారెడ్డితో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడోత్సవ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, డీఈవో భిక్షపతి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, డీవైఎస్‌వో అలీ, కర్తయ్య, యూనస్, డీపీవో వెంకయ్య, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతిపై అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): నార్కట్‌పల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ ఇలా త్రిపాఠి అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం నార్కట్‌పల్లిలోని ఎంపీడీవో, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీవో కే.ఉమేశ్‌చారిని ప్రశ్నించారు. పురోగతి ఆశించిన మేర లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ఉన్నారు.

దరఖాస్తులను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం శాలిగౌరారం నుంచి ఊట్కూరు వెళ్లే రహదారిలో లోలెవెల్ కాజ్‌వేను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ జమీరుద్దీన్ ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

రైతుసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్రం వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యంతో సకాలంలో యూరియా సరఫరా చేయకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాట్లు వేసిన 15-20 రోజుల్లో యూరియా వినియోగించాల్సి ఉండగా, మార్కెట్లో కొరతతో రైతులు పొలాలు వదిలి దుకాణాల ఎదుట క్యూకడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాట్లు పూర్తయి నెలగడుస్తున్నా యూరియా చల్లక, పంట ఎదుగుదల లోపిస్తోందని అన్నారు. పొద్దంతా లైన్‌లో నిలబడితే రెండు బస్తాల యూరియా కూడా దొరకడం లేదని, ఐదు ఎకరాలు ఉన్న రైతు ఎన్ని రోజులు లైన్లలో నిలబడాలని ప్రశ్నించారు. యూరియా కొరతతో రైతులు పడుతున్న అగచాట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిల్ల కనకయ్య, నాయకులు ఎర్రబోతు పద్మ, అంజన్న, ఎండి.సయ్యద్, పోలేపల్లి ఉదయ్‌కుమార్, షమీం, గువ్వల మట్టయ్య, మందడి కృష్ణారెడ్డి, రామలింగయ్య, వెంకట్‌నారాయణ, బుచ్చిబాబు, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీజీసీపీఎస్ నాయకులు

టీజీసీపీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామదాసు

నల్లగొండ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సెప్టెంబరు 1న చేపట్టనున్న సీపీఎస్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని టీజీసీపీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శిరందాసు రామదాసు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించి ఎన్జీ కళాశాలలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004 సెప్టెంబరు 1 తరువాత నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధన కోసం సెప్టెంబరు 1న సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే ఆత్మగౌరవ సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనస్, సుధాకర్, అనిల్, గౌస్ పాల్గొన్నారు.

● బుద్ధవనంలో విదేశీయులు



నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని సందర్శించిన 23 దేశాల ప్రతినిధులు 7

సాగర్ ఎడమకాల్వకు
నీటి విడుదల నిలిపివేత

- మూసీ 8 క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల 7
- డిండి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

ప్రయాణం ప్రయాస

ఒకరోజు ప్రయాణం చేస్తేనే పెద్దలు విశ్రాంతి తీసుకుంటుంటారు. అదే చిన్నారులు నిత్యం పదుల కిలోమీటర్ల ప్రయాణం చేస్తూ చదువులు సాగించాల్సి వస్తోంది. ఒక్కో విద్యార్థి నిత్యప్రయాణం సగటున లెక్కలు చూస్తే ఇది అర్థమవుతోంది. ఎంత దూరమైనా పర్వాలేదు నచ్చిన పాఠశాలలో చదవాల్సిందే ఇదీ తల్లిదండ్రుల ఆలోచన. ఎంతదూరం నుంచి వచ్చినా సరే మా పాఠశాలకు వచ్చిందే ముఖ్యం ఇదీ పాఠశాల యాజమాన్యాల తీరు. ఇద్దరి మధ్య చిన్నారులు ఏమీ చెప్పలేక ఎంతదూరమైనా సరే పాఠశాలకు వాహనాల్లో వెళ్లి చదువుకుంటున్నారు. ఇది వారి భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


ఆటోల్లో వెళ్తున్న విద్యార్థులు(ఫైల్ ఫొటో)

● రోజూ వాహనాల్లో పాఠశాలలకు విద్యార్థులు ● సరాసరి 40 కిలోమీటర్లు ప్రయాణం ● ఏడాదిలో 9,200 కిలోమీటర్లు ప్రయాణం ● భూవ్యాసార్ధం 6378.1 కిలోమీటర్లకంటే ఎక్కువ ప్రయాణం ● భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు : వైద్యులు

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కొఠారి కమిషన్ కొన్ని సూచనలు చేసింది. ఇందులో ముఖ్యంగా పాఠశాలలు విద్యార్థుల ఇంటికి ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉండాలని సూచించింది. దీనిప్రకారం ప్రాథమిక పాఠశాల కిలోమీటరు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు మూడుకిలోమీటర్ల దూరంలో ఉండొచ్చు. అదేవిధంగా ప్రభుత్వం పాఠశాలలను ఏర్పాటుచేసింది. కానీ ఆంగ్ల మాధ్యమంపై ఇష్టంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపడంతో ఇబ్బందులు ఎదువుతున్నాయి. దీంతో అందుబాటులో ఉన్నటువంటి ప్రభుత్వపాఠశాలలు ఉన్నా వినియోగించుకోవడం లేదు. ముఖ్యంగా గ్రామీణా ప్రాంతాల నుంచే విద్యార్థులు పట్టణాలు, మండల కేంద్రాలకు వస్తున్నారు. ఈ విధంగా నిత్యం సుమారుగా 10 నుంచి 30 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తూ విద్యనభ్యసిస్తున్నారు.

పట్టించుకోని సమస్యలు...

దూరంగా ఉన్న పాఠశాలలో చదివిస్తున్నాం అనే ఆనందంలో మాత్రమే తల్లిదండ్రులు ఉంటున్నారు. కానీ వారి ప్రయాణం, పాఠశాలకు వెళ్తున్న సమయాలను గుర్తించడం లేదు. విద్యార్థి పాఠశాల సమయం ఉదయం 9 గంటలకు ఉంటుంది. కానీ పాఠశాల బస్సు మాత్రం 7 గంటలకే ఊర్లోకి వస్తుంది. అప్పటికే చిన్నారులను తల్లిదండ్రులు సిద్ధంగా ఉంచుతారు. ఉదయం పాఠశాలలకు హడావిడిగా వెళ్లే క్రమంలో సరిగ్గా తినకుండానే వెళ్తున్నారు. దీంతో మధ్యాహ్నం వరకు సగం కడుపునింపుకునే వెళ్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం 4.30 గంటలకు పాఠశాల ముగుస్తుంది. ఇంటికి చేరుకునే సమయానికి చీకటిపడటమో, విద్యార్థి అలసిపోవడమో జరుగుతోంది. దీంతో ఆటపాటలతో పాటు శారీరక శ్రమ లేక మలమూత్ర విసర్జన సైతం సరిగ్గా చేయడంలేదని వైద్యులు చెబుతున్నారు. దీంతో కొత్తరోగాలు కొనితెచ్చుకున్నట్లేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా నిత్యంకిలోల కొద్దీ పుస్తకాల బ్యాగులు మోయడంతో చిన్నారుల ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. పుస్తకాల మోత బరువుపై అధికారులు, పాఠశాల యాజమాన్యాలు దృష్టి సారించడం లేదు.

● ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



చిన్నారులు నిత్యం పదుల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయడం ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. అదేవిధంగా చిన్నారులకు కొత్తరోగాలు వచ్చే పరిస్థితి ఉంటుంది. దీనికి తోడు ఉదయం వేళలో ఆహారం తీసుకోకపోవడంతో పోషక విలువలు తగ్గుతాయి. నిత్యం ప్రయాణంలో దుమ్ము, ధూళి చేరి శ్వాససంబంధ సమస్యలు తలెత్తుతాయి. 5వ తరగతి వరకు ఇంటికి సమీపంలోని పాఠశాలల్లోనే చిన్నారులను చేర్పించడం మంచిది.

డాక్టర్ సుధాకర్, వైద్యాధికారి, మఠంపల్లి, సూర్యాపేట జిల్లా

▸▸ భూవ్యాసార్ధానికి మించి ప్రయాణం

జిల్లాలో, పట్టణాలోని ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులు గ్రామీణ ప్రాంతల నుంచి అధికంగా వస్తుంటారు. ఉదాహరణకు సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రం, మట్టపల్లి నుంచి హుజూర్‌నగర్ 25 కిలోమీటర్లు, కోదాడ 40 కిలోమీటర్లు, మంచ్యాతండా నుంచి మఠంపల్లి 16 కిలోమీటర్లు, యాతవాకిళ్ల నుంచి హుజూర్‌నగర్ 22 కిలోమీటర్లు దూరం ఉంటుంది. అంటే నిత్యం 20 కిలోమీటర్లు వెళ్తూ ఒకరోజుల్లో 40కిలోమీటర్ల ప్రయాణం చేస్తున్నారు. ఒక విద్యా సంవత్సరంలో 220 నుంచి 250 వరకు పాఠశాలల పనిదినాలుంటాయి. అంటే సుమారుగా విద్యార్థి 230 పనిదినాలతో చూస్తే ఏడాదికి 9,200 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నాడు. అదేవిధంగా పదోతరగతి విద్యార్థులు ఆదివారాలు, సెలవుదినాల్లోనూ పాఠశాలలకు వెళ్తుంటారు. విద్యార్థుల ప్రయాణాన్ని లెక్కిస్తే భూవ్యాసార్థం 6,378.1 కిలోమీటర్లు ఉంటే అంత కంటే ఎక్కువదూరం ఏడాదిలో ప్రయాణిస్తున్నారు.


(ఫైల్‌ఫొటో)

ఉమ్మడి జిల్లాలో పండుగ పూట విషాదాలు

వినాయక చవితి పండుగ రోజు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విషాద సంఘటనలు చోటు చేసుకున్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో వినాయక మండపం పైనుంచి పడి కార్మికుడు, సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో చేపలు పట్టేందుకు వెళ్లి బాలుడు మృతి చెందాడు.


సత్యనారాయణ(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని విజేత యూత్ క్లబ్ గణేష్ మండపం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు విజేత యూత్ క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ నగర్ కాలనీలో గణేష్ ఉత్సవాల కోసం పెద్ద మండపాన్ని ఏర్పాటు చేసి గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భారీ వర్షంతో మండపంపై టార్పాలిన్ కప్పేందుకు పోతగల్ల సత్యనారాయణ, గుర్రు కృష్ణ, పెద్దల శ్రీనివాస్ కలిసి మండపం వద్దకు వచ్చారు. ఉదయం 8 గంటలకు సత్యనారాయణ(సతీష్)(37) మండపంపైకి ఎక్కి టార్పాలిన్ కవరు వేస్తున్నాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు ఐదేళ్లలోపు కుమారులున్నారు. సత్యనారాయణ మృతితో అతడి కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. సత్యనారాయణ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. సత్యనారాయణ కుటుంబానికి న్యాయం చేయాలని, నష్టపరిహారం చెల్లించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన స్థలంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 6 గంటల పాటు ఆందోళన నిర్వహించారు. కాగా, పెద్ద మనుషుల ఒప్పందం మేరకు బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో సంఘం సభ్యులు విరాళాలు పోగు చేసుకుని రూ.4.25లక్షలు ఇచ్చేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రాములు, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్ల లక్ష్మణ్, పెద్దల చక్రపాణి, కరగల్ల కుమార్, పోతగల్ల దానయ్య, కొమ్ము లక్ష్మణ్, చెర్కు నర్సింహ, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడు...

కోదాడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగ సందర్భంగా పాఠశాలకు సెలవుకావడంతో చేపలు పట్టేందుకు వెళ్లిన విద్యార్థి చెరువులో పడి మృతి చెందాడు. ఈ సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో గణపవరం గ్రామంలో జరిగింది. కోదాడ రూరల్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గణపవరం గ్రామానికి చెందిన కుక్కడపు మనోహర్(11) కోదాడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. బుధవారం వినాయకచవితి పండుగ సందర్భంగా సెలవు కావడంతో గ్రామానికి వెళ్లి స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు చెరువు వెళ్లాడు. చెరువుకట్టపై నుంచి చేపలు పడుతూ ప్రమాదశాత్తు అందులో పడి మృతి చెందాడు. తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదుమేరకు రూరల్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరో ప్రమాదంలో కోదాడ మండలం రెడ్లకుంట గ్రామానికి గుళ్ల రాజేష్(21) గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. రాజేష్ తల్లిదండ్రులు చిన్నప్పుడే అతడిని వదలివెళ్లిపోవడంతో రాజేష్ వాళ్ల అమ్మమ్మ దగ్గర ఉంటున్నాడు. వినాయక పండుగ సందర్భంగా అమ్మమ్మ దేవుడి మండపానికి వెళ్లిన సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఏమరుపాటులో కుమారుడిని విడిచి వెళ్లిన తల్లి


నవాజ్ ఖురేషిని తండ్రి గౌస్‌ఖురేషికి అప్పగిస్తున్న కానిస్టేబుల్ మహేష్

నార్కట్‌పల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి తన నాలుగేళ్ల కుమారుడిని ఏమరుపాటులో ఓ హోటల్ వద్ద విడిచివెళ్లగా, పోలీసులు వివరాలు తెలుసుకుని ఆ బాలుడిని క్షేమంగా తండ్రికి అప్పజెప్పారు. మంగళవారం అరరాత్రి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఈ సంఘటన జరిగింది. కానిస్టేబుల్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం మహిళలు ఈ నెల 26వ తేదీన కావేరి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరులో గల రెహమతాబాద్ దర్గా సందర్శనకు వెళ్తున్నారు. మార్గమధ్యలో అర్ధరాత్రి 12గంటలు దాటిన తర్వాత నార్కట్‌పల్లి నుంచి అద్దంకి రహదారిలో నార్కట్‌పల్లి మండల కేంద్ర శివారులో ఉన్న మద్రాస్ ఫిల్టర్ కాఫీ పాయింట్ వద్ద కొద్దిసేపు బస్సు నిలిపారు. బస్సు ఎక్కే క్రమంలో మలక్‌పేట ప్రాంతానికి చెందిన మహ్మద్ పర్వీన్ ఏమరుపాటులో తన నాలుగేళ్ల కుమారుడైన నవాజ్ ఖురేషిని హోటల్ వద్దే మరిచి బస్సెక్కి వెళ్లిపోయింది. కొద్దిసేపటి తర్వాత ఆ బాలుడు ఒక్కడే అటూ ఇటూ తిరుగుతుండటంతో అనుమానించిన హోటల్ సిబ్బంది 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. నార్కట్‌పల్లి స్టేషన్‌లో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ మహేష్ హోటల్ వద్దకు వచ్చి బాలుడితో మాట్లాడారు. హోటల్ వద్ద సీసీ పుటేజీని పరిశీలించి ఆ అబ్బాయి ప్రయాణించిన బస్సు నెంబర్‌ను తెలుసుకున్నారు. బస్సులో టిక్కెట్లు బుక్ చేయించిన వ్యక్తికి ఫోన్ చేసి నవాజ్ ఖురేషి తప్పిపోయి హోటల్ వద్ద ఉన్న విషయాన్ని తెలియపర్చాడు. దీంతో బాలుడి తండ్రి మహ్మద్ గౌస్ ఖురేషి తన సోదరుడితో కలసి నార్కట్‌పల్లికి వచ్చారు. ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్‌తో మాట్లాడిన అనంతరం వచ్చిన వ్యక్తి నవాజ్ ఖురేషి తండ్రేనని నిర్ధారించుకున్న అనంతరం అతడికి అప్పగించారు. తన కుమారుడిని క్షేమంగా అప్పజెప్పిన కానిస్టేబుల్ మహేష్‌కు, హోటల్ సిబ్బందికి గౌస్ ఖురేషి కృతజ్ఞతలు తెలిపారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలి: రాములు

నల్లగొండ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు రక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరి రాములు అన్నారు. సంఘం నల్లగొండ పట్టణ మహాసభ నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తూ పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను దెబ్బతీస్తోందన్నారు. అడ్డా ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అడ్డా మీదికి పనికొచ్చిన వారికి పేరు నమోదు చేసుకొని పనిలేని రోజుల్లో సంక్షేమ బోర్డు ద్వారా సగం కూలి చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సైదాచారి, పాక లింగయ్యల అధ్యక్షతన జరిగిన సమావేశంలో నర్సింహ, రామచంద్రు, బ్రహ్మాచారి, నాగారాజు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ కమిటీ ఏకగ్రీవం

బిల్డింగ్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులుగా సలివోజు సైదాచారి, కార్యదర్శి ఆవుట రవిందర్, కోశాధికారి దేవురపల్లి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పాక లింగయ్య, కత్తుల జగన్, నోముల యాదయ్య, సాగర్ల మల్లయ్య, గడగోజు వెంకటాచారి, సహాయ కార్యదర్శులుగా భీమనలపల్లి శంకర్, వల్లపు సైదరాజు, తవుడోజు నాగచారిలతో కలిసి 23మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు


గణపతి పూజలో అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో ఉత్సవమూర్తులను అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడికి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలతో పాటు ఆశీర్వచనం అందజేశారు.అంతకుముందు గర్భాలయంలో సుప్రభాత సేవతో పాటు నిజాభిషేకం,నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.26,17,198 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా తరగని ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ శరత్‌తో పాటు ఐపీఎస్ మురళీధర్, తమిళనాడుకు చెందిన ఆరుగురు ఐపీఎస్‌లు ఉన్నారు.

వినాయక చవితి వేడుకలు

క్షేత్రంలోని పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో వినాయకచవితి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వస్తివాచనం నిర్వహించి రక్షాబంధనం చేపట్టారు. 21 పత్రాలతో పూజలు నిర్వహించారు. వేడుకల్లో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, ఆలయ ఏఈవో జూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకులు శంకర్‌నాయక్, నాగుల మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


చెట్లతో మూసుకుపోయిన మెట్ల దారి

నేడు గిరిప్రదక్షిణ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం గిరిప్రదక్షిణ నిర్వహించనున్నారు. వేకువజామున ఆలయంలో అష్టోత్తరశతఘటాభిషేకం నిర్వహిస్తారు. వివిధప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొంటారు. దేవస్థానం ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5.30 గంటలకు వైకుంఠద్వారం చెంత అధికారికంగా ప్రారంభిస్తారు. కాగా కొండకు పడమర దిక్కులో మూడు రోజులుగా కురుస్తోన్న వర్షాలకు కొండచరియలు గిరిప్రదక్షిణ దారికి అడ్డంగా జారిపడగా వాటిని ఆలయ అధికారులు తొలగించలేదు.

కొండకు పశ్చిమ దిక్కులో ఫ్లైఓవర్ సమీపంలో గిరిప్రదక్షిణ భక్తుల కోసం కొండ అంచుభాగంలో పైకెక్కి కిందకు దిగేందుకు మెట్లదారిని వైటీడీఏ నిర్మించింది. ఇప్పుడు ఆ దారి ఏపుగా పెరిగిన చెట్లతో మూసుకుపోయింది. 120మెట్లు ఎక్కేందుకు అందుబాటులో ఉండగా దిగేందుకు 50మెట్లకు పైగా నిర్మించాల్సి ఉంది. పూర్తిగా సిమెంట్ ఇటుకతో సగం మెట్లు నిర్మించి సగం వదిలేశారు. భక్తులు రోడ్లపై నడవకూడదనే ఆగమేఘాల మీద నిర్మించగా నిధులు వృథా కావడమే కాక నిరుపయోగంగా మారింది. ఏపుగా పెరిగిన చెట్లతో పూర్తికాని మెట్ల దారి, అడ్డంగా పడిపోయిన బండరాయితో గిరిప్రదక్షిణ దారి నడవలేని పరిస్థితి ఉంది.

నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య


రమేష్ మృతదేహం

నల్లగొండ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింతకింది రమేష్ (40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య రేణుక ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ తన కుటుంబంతో 15 ఏళ్లు జిల్లా కేంద్రంలోని బీటీఎస్ ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. భార్య రేణుకతో రెండు నెలల క్రితం గొడవ జరగడంతో ఆమె నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇద్దరికీ కౌన్సెలింగ్ చేశారు. అయినా విబేదాలు సమసిపోకపోవడంతో పిల్లలతో కలిసి భార్య రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో రమేష్ నల్లగొండలో ఒంటరిగానే ఉంటున్నాడు. గురువారం ఉదయం నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల ఎదుట ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద ఓ వ్యక్తి హత్యకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వద్ద ఆధారాల ప్రకారం చింతకింది రమేష్‌గా గుర్తించారు. బండరాళ్లతో తలపైనా, ఇతర శరీర భాగాలపైనా దాడి చేయడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై రమేష్ బావమరిది బుషిపాక వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ సాగిస్తున్నారు. వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో డ్వాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలంలో పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతం నుంచి డ్వాగ్ స్క్వాడ్ మునుగోడు రోడ్డులో ఐదు కిలోమీటర్ల వరకు వెళ్లినట్లు సమాచారం. క్లూస్ టీం బృందం వివరాలు సేకరిస్తోంది. హత్యకు ముందు రమేష్ బుధవారం రాత్రి తన స్నేహితులతో కలిసి మద్యం తాగినట్లు తెలిసింది. దీంతో హత్య జరిగిన ప్రాంతంతో పాటు ఆ పరిసరాల్లోని రహదారి వెంట ఉన్న సీసీ పుటేజీలను వన్‌టౌన్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

కుర్చీలో కూర్చునేదెట్లా?

(5వ పేజీ తరువాయి)

13న సొసైటీల, డీసీసీబీ పాలకవర్గం ముగిసిన సమయంలో సొసైటీలతో పాటు డీసీసీబీ పాలకవర్గానికి ఆరు నెలల గడువు పెంచింది. తాజాగా, ఈనెల 14న మరో ఆరు నెలలు పెంచుతూ జీవో జారీ చేసిన ప్రభుత్వం సొసైటీల గడువుకు బ్రేక్ వేయడం రాజకీయంగా జోరుగా చర్చ సాగుతోంది. తిరిగి ఆ ప్రజాప్రతినిధులంతా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతో పాటు రాష్ట్ర సహకారశాఖ మంత్రిని, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పాలకవర్గాల గడువు పెంచాలని కోరనున్నట్టు తెలిసింది.

సీఈవోల బదిలీపైనా గందరగోళం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 108 సొసైటీలు ఉండగా, 74మంది సీఈవోలను మూడు రోజుల క్రితం జిల్లా సహకార అధికారులు బదిలీ చేశారు. వాస్తవానికి చాలా పీఏసీఎస్‌ల సీఈవోలు 30 ఏళ్లకు పైగా ఒకే ప్రాంతంలో తిష్టవేయగా, వారందరినీ నిబంధనలకు అనుగుణంగా బదిలీ చేశారు. చాలా మంది సొసైటీ చైర్మన్లు ఒకే ప్రాంతంలో ఉండటంతో చైర్మన్ల మాట వినే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లాలో 27మంది సీఈవోలను, సూర్యాపేట జిల్లాలో 28మందిని, యాదాద్రి జిల్లాలో 20మంది సీఈవోలను మూడు రోజుల క్రితం జిల్లా సహకార అధికారులు బదిలీ చేశారు. అయితే వీరంతా కోర్టును ఆశ్రయించడంతో గురువారం హైకోర్టు స్టే ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. వాస్తవానికి చాలా మందిని సమీప ప్రాంతాలకు బదిలీ చేసినా వారంతా కోర్టును ఆశ్రయించారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో ఉండి సహకార వ్యవస్థ అభివృద్ధికి ఆటంకాలుగా మారిన సమయంలో బదిలీలు చేయగా, వారు తిరిగి పూర్వ సొసైటీలకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

పాలకవర్గాల పెంపునకు అనుమతి రాలేదు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 108 సొసైటీలు ఉండగా, 107 సొసైటీల పదవీకాలం పెంపునకు ఎలాంటి అనుమతి రాలేదు. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించి మాత్రమే ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. డీసీసీబీలోని పాలకవర్గాల డైరెక్టర్లు, పీఏసీఎస్‌ల పదవీకాలం పెరగలేదు. ఆయా సొసైటీల చైర్మన్ల చెక్‌పవర్ కూడా నిలిపివేశాం. అదేవిధంగా 74మంది సీఈవోలను పారదర్శకంగా బదిలీ చేశాం. అయితే వారికి కోర్టు స్టే ఇచ్చిన విషయం నా దృష్టికి రాలేదు.

పత్యానాయక్, డీసీవో, నల్లగొండ

సహకార సంఘాల్లో 40 ఏళ్ల తర్వాత సీఈవోల బదిలీలు

మోత్కూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని సింగిల్ విండోల కార్యదర్శులను పెద్ద సంఖ్యలో భారీగా బదిలీ చేశారు. మొత్తం 85 మందికి బదిలీ జరిగింది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు మరి కొన్ని జిల్లాల్లో సింగిల్ విండోల కార్యదర్శులను (సంఘం సీఈవోలను) రెండు రోజుల క్రితం బదిలీ చేశారు. గతంలో పదవి విరమణ పొందినప్పుడు ఆ స్థానంలో కొత్తవారిని నియమించడం తప్ప సింగిల్ విండోల కార్యదర్శులకు బదిలీలు ఉండేవి కావు. సింగిల్ విండో వ్యవస్థ ఏర్పడిన నాటి (1985) నుంచి ఇంతవరకు కార్యదర్శుల బదిలీలు జరుగలేదు. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వ జీవో 44 ప్రకారం ఆకస్మికంగా కార్యదర్శుల మూకుమ్మడిగా బదిలీ చేయడంపై కార్యదర్శులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు చేయడానికి కార్యదర్శుల నుంచి తొలుత నాలుగు ఆప్షన్లు ఇవ్వాలని అధికారులు కోరగా కొందరు ఆప్షన్లు ఇవ్వగా, మరికొందరు ఇవ్వలేదని తెలిసింది. కొందరు ఇచ్చిన ఆప్షన్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా డీఎల్‌ఈసీ ఈ నెల 25న కార్యదర్శులందరినీ ఒకేసారి బదిలీలు చేసిందంటున్నారు. తమకు పీఆర్సీ అమలు చేయడం లేదని, తమకు పదవీ విరమణ ప్రయోజనాలు ఏమిటన్నది కూడా స్పష్టత లేదని, ఇప్పటికి సుమారు 30 ఏళ్లకు పైగా ఒకే చోట పని చేయగా, ఇప్పుడు బదిలీ చేస్తే తమకు పదవి విరమణ సందర్భంగా రావాల్సి ప్రయోజనాలు ఏ సంఘం నుంచి తీసుకోవాలన్నది తెలియడం లేదని, వాటిపై స్పష్టత ఇచ్చాకే తమను బదిలీ చేయాలని కోరుతున్నారు.

సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు లైన్‌క్లియర్!

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారని, దీనికి పరిష్కారం చూపాలని సూచించారు. దీంతో భూభారతి చట్టంలో సెక్షన్-6ను ఏర్పాటు చేసి సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. తాజాగా, హైకోర్టుసైతం ఈ చట్టాన్ని సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో ఇక సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు తొలగిపోయాయి. ఈ దరఖాస్తులను పరిష్కరించి, భూభారతిలో రిజిస్ట్రేషన్ చేసి, పట్టాలందించాలని నిర్ణయించారు. ఆర్డీవో స్థాయిలో వీటిని పరిష్కరించనున్నారు. గతంలో వచ్చిన దరఖాస్తులనే ఇప్పుడు పరిష్కరించాలని నిర్ణయించారు. సాదాబైనామాల ద్వారా భూముల కొనుగోలు చేసిన రైతులు మోఖాపై వారే ఉంటున్నప్పటికీ, రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో పట్టాలు పొందలేకపోయారు. దీంతో ప్రభుత్వం అందించే రైతుభరోసా, రైతుబీమా, పంటరుణాలు, ఎరువుల సబ్సిడీలు ఇతరత్రా ప్రయోజనాలను పొందలేకపోయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాదాబైనామాల కింద దాదాపు 1,60,263 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ ఆయా డివిజన్లలోని ఆర్డీవోలు పరిశీలించి పరిష్కరించనున్నారు. అందుకు ప్రభుత్వం నుంచి నిర్దిష్ట విధివిధానాలు వచ్చిన వెంటనే జిల్లాలోనూ సాదాబైనామాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడతామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

దూరం ఒకటే, టికెట్ ధరలో వ్యత్యాసం

ప్రయాణికుల నుంచి అదనపు చార్జీ వసూలు



బస్సు టికెట్ ధరల్లో మార్పులు

తిరుమలగిరి, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి):ఒకే దూరానికి టికెట్ ధరలో వ్యత్యాసం ఉంటోంది. ఒక్కో డిపో బస్‌కు, ఒక్కో చార్జీని వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి మీదుగా హైదరాబాద్, తొర్రూర్, సూర్యాపేట, జనగామ, మహబూబాబాద్ డిపోల బస్సులు నిత్యం వెళ్తుంటాయి. ఈ బస్సుల్లో ఒక్కో డిపోకు చెందిన బస్సులో టికెట్ రేటు వ్యత్యాసం ఉండడంతో ప్రయాణికులు విస్మయానికి గురవుతున్నారు. తొర్రూర్-తిరుమలగిరి మధ్య దూరం సుమారు 28 కిలోమీటర్లు. ఈ దూరంలో తొర్రూర్, మహబూబాబాద్ డిపో బస్సుల్లో టికెట్ రేట్లలో వ్యత్యాసం ఉంటోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. తొర్రూర్ డిపో బస్సుల్లో కంటే, మహబూబాబాద్ డిపో బస్సుల్లో అదనంగా రూ.20ల చార్జీ వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. గురువారం తిరుమలగిరికి చెందిన ఓ ప్రయాణికుడు ముందుగా తిరుమలగిరి నుంచి తొర్రూర్‌కు అదే డిపోకు చెందిన బస్సులో వెళ్లగా కండక్టర్ రూ.60లు తీసుకున్నాడు. అక్కడి నుంచి ఆ ప్రయాణికుడు మహబూబాబాద్ డిపో బస్‌లో తిరుమలగిరి వస్తుండగా కండక్టర్ రూ.80లు తీసుకుని టికెట్ ఇచ్చాడు. తాను ఉదయం వచ్చినపుడు రూ.60 మాత్రమే టికెట్ ధర చెల్లించానని, ఇప్పుడు రూ.80లు టికెట్ ఎలా ఇస్తున్నారని ప్రయాణికుడు ప్రశ్నించాడు. రూ.20లు అదనపు చార్జి ఎందుకని అడిగితే తమకు తెలియదని, డిపో అధికారులకు తెలుసని సదరు కండక్టర్ చెప్పారని ప్రయాణికుడు తెలిపాడు. చేసేదేమీ లేక అదనంగా రూ. 20 చెల్లించి తిరుమలగిరి చేరుకున్నట్లు తెలిపాడు.

టికెట్ ధరలో తేడా ఉంది

నేను ఉదయం తిరుమలగిరి నుంచి తొర్రూరుకు వెళ్లినప్పుడు కండక్టర్ రూ.60 తీసుకుని టికెట్ ఇచ్చాడు. మళ్లీ తొర్రూర్ నుంచి తిరుమలగిరి వచ్చేటప్పుడు కండక్టర్ రూ.80లు తీసుకుని టికెట్ ఇచ్చాడు. దూరంతో సంబంధం లేకుండా అదనంగా రూ.20లు వసూలు చేశారు.

జంపాల పూర్ణచందర్, తొండ గ్రామస్థుడు

రెండు రోజుల జైలు శిక్ష

నాగార్జునసాగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష పడినట్లు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఎస్‌ఐ ముత్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సాగర్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా పీఏపల్లికి చెందిన ఇస్లావత్ రాము మోతాదుకు మించి తాగినట్లు గుర్తించామన్నారు. అతడిని గురువారం నిడమనూరు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి స్వప్న రెండురోజుల జైలు శిక్ష విధించారన్నారు.

పేకాటరాయుళ్లపై నమోదు

మునగాల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తాడ్వాయి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం తాడ్వాయి గ్రామం ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో నలుగురు ఇంటి బయటి నుంచి తాళం వేసి లోపల పేకాట ఆడుతున్నారని వచ్చి సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,230 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు రిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.

చెర్వుగట్టు ఆలయ రికార్డుల తనిఖీ



చెర్వుగట్టు దేవస్థానంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీసీ వినోద్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం నిర్వహణ రికార్డులను ఎండోమెంట్ శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీ వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆయనతో పాటు దేవాదాయశాఖ నల్లగొండ జిల్లా సహాయ కమిషనర్ భాస్కర్‌శర్మ, అకౌంటెంట్ ప్రభాకర్ శ్రీవాత్సవలతో పాటు మరో ఇద్దరితో కూడిన బృందం రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా డీసీ వినోద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు తాము రికార్డులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆలయ నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల రికార్డులు, టెండర్ రికార్డులు, క్యాష్ బుక్, ప్రసాద విక్రయాలు, డీసీఆర్, ఆదాయ వ్యయాలు, పనిచేస్తున్న సిబ్బంది వేతనాల చెల్లింపు, బకాయిలు, ఉత్సవాల ఖర్చులు, అనుమతులు, ఆలయానికి సంబంధించిన గోల్డ్, సిల్వర్ రికార్డులను పరిశీలించినట్లు వివరించారు. తమకు కావాల్సిన సమాచారాన్ని ఈవో సిరికొండ నవీన్‌కుమార్‌ను విచారించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. తనిఖీ నివేదికను కమిషనర్‌కు అందజేస్తామని వినోద్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవం

నల్లగొండటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాలను మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ హరీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మూడు కిలోమీటర్ల పరుగు పందెంను ఎంజీయూ క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో విద్యార్థులు, అధ్యాపకులకు మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బాధితులకు పునరావాసం కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మర్రిగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ముంపు గ్రామాల బాధితులకు పునరావాసం కల్పించి చర్లగూడెం రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పిట్టల శ్రీనివాస్, కోమటి వీరేశం, మండల అధ్యక్షుడు రాజేంద్రనాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన బాధిత భూ నిర్వాసితులకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాజాపేట చౌరస్తా నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు నాలుగులేన్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ నాయకులు చాపల వెంకట్, యర గోపాల్, గ్యాస్ అశోక్‌రెడ్డి, గార లింగం, మామిడి పరశురాం, భాస్కర్ నాయక్, యాదయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు నుంచి నల్లగొండకు ఎక్స్‌ప్రెస్ బస్సు

మోత్కూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు నుంచి తిరుమలగిరి, మోత్కూరు, నార్కట్‌పల్లి మీదుగా నల్లగొండకు తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు నడుపుతున్నారు. తొర్రూరు నుంచి ఉదయం 7.30 గంటలకు బయలుదేరి 9.30 గంటలకు మోత్కూరు చేరుకుని, మోత్కూరు నుంచి నార్కట్‌పల్లి మీదుగా నల్లగొండకు చేరుకుంటుంది. అనంతరం తిరిగి 11గంటలకు అక్కడి నుంచి బయలుదేరి నార్కట్‌పల్లి, మోత్కూరు, తిరుమలగిరి మీదుగా తొర్రూరు డిపోకు చేరుకుంటుందన్నారు. దీంతో తిరుమలగిరి, మోత్కూరు, నార్కట్‌పల్లి మీదుగా నల్లగొండకు తొలి ఎక్స్‌ప్రెస్ సర్వీసు సౌకర్యం ఏర్పాటు చేయడంలో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు బాసటగా..



» జాతీయ కుటుంబ ప్రయోజన పథకం
» ఎన్‌ఎఫ్‌బీఎస్ కింద రూ.20వేలు
» కుటుంబ పెద్ద మరణిస్తే ఆర్థికసాయం
» రెండేళ్లలోపు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు
» పథకంపై అవగాహన లేకపోవడంతో బాధితుల ఇక్కట్లు

తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

చండూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబానికి ఒకింత సాయంగా నిలిచేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) ప్రారంభించింది. ఎనిమిదేళ్లుగా అమలవుతున్న ఈ పథకంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో సాయం కోసం దరఖాస్తులు నామమాత్రంగానే వస్తున్నాయి. ఒకప్పుడు ఈ పథకం కింద అనేక మంది దరఖాస్తు చేసుకునేవారు. కానీ ప్రస్తుతం సరైన అవగాహన లేకపోవడంతో దరఖాస్తులు పూర్తిగా తగ్గిపోయాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన యాజమానులు, ప్రతి ఏడాది వందల సంఖ్యల్లో మృత్యువాత పడుతుండటం, ఈ పథకంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించకపోవడంతో, బాధితులు లబ్ధి పొందలేక పోతున్నారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు సఫలీకృతం కాలేదు.

ఇదీ పరిస్థితి

దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న కుటుంబంలోని పెద్ద చనిపోతే సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో గ్రామ, మండల అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.20వేలు సాయం అందుతుంది. కుటుంబంలోని వితంతువు, అవివాహిత కుమార్తెకు ఈ పథకం ప్రయోజనం లభిస్తుంది. కుటుంబ పెద్ద 18 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలి. సాధారణ, ప్రమాదవశాత్తు, మృతి చెందిన రెండేళ్ల లోపు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారుల ఆమోదం అనంతరం సాయం కోసం అధికారులు ప్రభుత్వానికి సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఈ పథకంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తేనే మేలు జరుగుతుంది. ప్రభుత్వపరంగా మండల, గ్రామ స్థాయిలో అనేక కార్యక్రమాలు చేపడుతున్న అధికారులు, ఏనాడు కూడా ఏ ఒక్క అధికారి కూడా ఇది మంచి పథకం ఉందన్న విషయం చెప్పలేదనే విమర్శలు వస్తున్నాయి.

అవగాహన లేకపోవడంతో...

కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని 2017లో ప్రారంభించింది. ఈ పథకంపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో బాధిత కుటుంబాల వారు సహాయం కోసం దరఖాస్తు చేసుకోలేపోయారు. గడిచిన ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకు మండలంలో కేవలం ముగ్గురు మాత్రమే సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో పోషకులు మృతి చెందుతున్నా బాధిత కుటంబాలు పథకానికి నోచుకోలేకపోతున్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవతో ఇటీవలే ఈ పథకం అమలుతీరుపై జిల్లా కేంద్రంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. దీంతో అధికారులు పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, దరఖాస్తులను స్వీకరించడానికి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

పథకానికి అర్హులు ఎవరంటే...

» మృతిచెందిన వ్యక్తి ఇంటి యజమాని అయి ఉండాలి.
» మరణించిన వ్యక్తి వయస్సు 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి.
» 2017 జనవరి 1వ తేదీ తర్వాత చనిపోయి ఉండాలి.
» ఏడాదికి రూ.60 వేలులోపు ఆదాయం కలిగి ఉండాలి.

కావల్సిన ధ్రువీకరణ పత్రాలు

» మరణ ధ్రువీకరణ పత్రం » తెల్ల రేషన్‌కార్డు,
» ఆధార్‌కార్డు » బ్యాంకు ఖాతా జిరాక్స్
» కులం, ఆదాయం, కుటుంబసభ్యుల సర్టిఫికెట్

ప్రజలకు అవగాహన కల్పిస్తే...

గ్రామాల్లో మహిళా సంఘాలతో అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుంది. మహిళా సంఘాలు గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోనే పని చేస్తాయి. క్షేత్రస్థాయిలో నిరంతరం సమావేశాలు జరుగుతాయి. మహిళా సంఘాల సభ్యులతో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంది. మొదట ఈ పథకం గురించి మహిళా సంఘాల సమావేశంలో అధికారులు వివరాలు, అమలుతీరును తెలియజేస్తే, ఈ పథకాన్ని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చాం. దరఖాస్తు ఫారం అన్ని జీరాక్స్ సెంటర్లలో లభిస్తాయి. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయనవసరం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశాం. రెండు రోజుల్లోనే 83 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.



- కె.చంద్రశేఖర్, తహసీల్దార్ చండూరు

బుద్ధవనం అద్భుత కట్టడం

బుద్ధవనం, నాగార్జుసాగర్‌లను సందర్శించిన 23 దేశాల ప్రతినిధులు



నాగార్జునకొండపై 23 దేశాల ప్రతినిధులు

నాగార్జునసాగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బుద్ధవనం మహాఅద్భుతమని పలు దేశాల ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ కేంద్రమైన నాగార్జునసాగర్‌ను బుధవారం 23దేశాలకు చెందిన 27మంది ప్రతినిధులు సందర్శించారు. నేపాల్, టాంజానియా, శ్రీలంక, వియత్నాం, జింబాబ్వే, నైజీరియా, ఇథియోపియా, సౌత్ సూడాన్, టాంజానియా, జమైకా, జోర్డాన్, పనామా, జాంబియా, ఘనా, లిబ్రియా, రష్యా, సిరిలోనియా తదితర 23 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ నెల 15వ తేదీ నుంచి హైదరాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'వివిధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు అభివృద్ధి' అనే అంశంపై శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 30వ తేదీన ఈ శిక్షణ ముగియనుంది. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం టీం కో ఆర్డినేటర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. ఈ సందర్శనలో భాగంగా జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ లాంచీలో చేరుకున్నారు. అక్కడ మ్యూజియం, సింహాళీయం, బౌద్ధ మత స్తూపాలను, నమూనాలను తిలకించారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాంను సందర్శించారు. ఆ తర్వాత తెలంగాణ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. బుద్ధవనంలో సమావేశ మందిరంలో బుద్ధవనం వీడియోను తిలకించారు. మహాస్తూపం లోపల ధ్యానమందిరంలో ధ్యానం చేశారు. బుద్ధవనంలో చరితవనం, జాతక వనం, ధ్యానవనాలను తిలకించారు. వీరికి సాగర్, నాగార్జునకొండ, బుద్ధవనం విశేషాలను పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, పెద్దవూర తహసీల్దార్ రఘు, సాగర్ సీఐ శ్రీను నాయక్, సాగర్ డ్యాం ఈఈ నాగేశ్వర్‌రావు, ఏఈ కృష్ణయ్య, బుద్ధవనం అధికారులు శాసన, రవిచంద్ర, రెవెన్యూ ప్రొటోకాల్ ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ ముత్తయ్య, ఎస్పీఎఫ్ ఎస్ఐ రఘు పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జునుడి బోధనలు ఆచరణీయం

● శివనాగిరెడ్డి, ప్రముఖ బౌద్ధ విశ్లేషకులు

నాగార్జునసాగర్: 1, 2వ శతాబ్దాల్లో రెండో బుద్ధునిగా కీర్తి గడించిన ఆచార్య నాగార్జునుడి బోధనలు నేటికీ ఆచరణీయమేనని ప్రముఖ బౌద్ధ విశ్లేషకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఇల్లివాయిస్ రాష్ట్రం చికాగోలో 1944లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బందీలైన జపాన్-అమెరికన్ పునరావాసం సందర్భంగా నిర్మించిన మిడ్ వెస్ట్ బౌద్ధాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ బౌద్ధులను ఉద్దేశించి ఆయన మా ట్లాడుతూ ఆచార్య నాగార్జునుడి మధ్యమమార్గం, శూన్యవాదం, నైతిక వర్తన, సచ్ఛీలత, వివేకం, శాశ్వతానందాన్ని ఇచ్చే బుద్ధుని చతురార్య సత్యాలను అనుసరిస్తే సమాజంలో రుగ్మతలు తొలగిపోతాయన్నారు. బుద్ధుని బోధనలు, ఆచార్య నాగార్జునుడి తాత్వికములు, ఈ తరానికి అందించి, బౌద్ధ సంస్కృతిని పరిరక్షించటానికి బుద్ధవనం సాగర్‌లో నిర్మించినట్లు తెలిపారు. దేశంలో అతి పెద్ద బుద్ధవనాన్ని దక్షిణాసియా, పశ్చిమాసియా దేశాలకు చెందిన బౌద్ధ పర్యాటకులు సందర్శిస్తున్నారని తెలిపారు. అనంతరం చికాగో మిడ్ వెస్ట్ బౌద్ధాలయం ప్రధానాచార్యులు పూజ్య గ్యోదో కోనో తాను రచించిన పుస్తకాలను ఆయన శివనాగిరెడ్డికి బహూకరించారు. కార్యక్రమంలో చికాగో సాహితీమిత్రులు సంస్థ కార్యదర్శి జయదేవ్ మెట్టుపల్లి పాల్గొన్నారు.



పుస్తకాన్ని శివనాగిరెడ్డికి అందిస్తున్న గ్యాదో కోనో

సాగర్ ఎడమకాల్వకు
నీటి విడుదల నిలిపివేత

● 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



నీటి విడుదల నిలిపివేసిన ఎడమకాల్వ

నాగార్జునసాగర్,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమకాల్వకు ప్రాజెక్టు అధికారులు గురువారం నీటి విడుదలను నిలిపివేశారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎడమకాల్వ ఆయకట్టులో రైతులకు ప్రస్తుతం సాగునీటి అవసరం లేనందున నీటి విడుదలను నిలిపివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అంతేకాక ఎడమకాల్వ కట్టలు వర్షాలకు నాని ఉండటంతో ఎక్కడైనా బుంగలు పడతాయని ముందస్తుగా నీటి విడుదలను నిలిపివేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 586.60 అడుగులు (303.4310 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9019 క్యూసెక్కుల నీటిని, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్లల్లో 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 2,01,318 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,46,410 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి అంతే మొత్తంలో నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

● మూసీ 8 క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో నాగార్జునసాగర్‌గా పేరొందిన మూసీ ప్రాజెక్టు వరద నీటితో పొంగిపొర్లుతోంది. మంగళ, బుధవారాల్లో ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగరంలో విస్తారంగా కురిసిన వర్షాలకు వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు భారీగా చేరుతోంది. ఈ క్రమంలో ఇన్‌ఫ్లో 9956.36క్యూసెక్కులు నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు 643.58 అడుగుల గరిష్ఠ స్థాయిలో ఉండటంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు మొత్తం 8 గేట్లను ఎత్తి ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు మించి 10350.64 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 643.58 అడుగులు(4.09టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టుకు కుడి, ఎడమ కాల్వల ద్వారా 240.30 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

డిండి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

డిండి: డిండి ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. గురువారం ఎగువ నుంచి 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు జేఈ పరమేష్ తెలిపారు. అదే మోతాదులో స్పిల్‌వే, వియర్ మీది నుంచి దిగువకు నీరు విడుదలవుతోందని తెలిపారు. ప్రాజెక్టు 36అడుగులు (2.4టీఎంసీ) గరిష్ఠస్థాయిలో నిండు కుండలా ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు దుందుభి వాగుకు వరద వచ్చి చేరి ఈ నెల 14 నుంచి ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అవుతూనే ఉంది.

పరవళ్లు తొక్కుతున్న మూసీ

వలిగొండ: హైదరాబాద్ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షం వల్ల మూసీ పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని సంగెం పరిధిలో భీమలింగం వద్ద మూసీ నదిలోకి వరదనీరు చేరుతోంది. కత్వ పైనుంచి మూసీ ఉగ్రరూపం దాల్చుతోంది. భీమలింగం లోలెవల్ కల్వర్టు పైనుంచి వరదనీరు ప్రవహించడంతో అధికారులు ముందు జాగ్రత్తగా సంగెం-బొల్లెపల్లి గ్రామాల నడుమ రాకపోకలను నిలిపివేసి పికెటింగ్ ఏర్పాటు చేశారు. ప్రత్యామ్నాయంగా చౌటుప్పల్ సంగెం పరిసర ప్రాంత ప్రజలను వలిగొండ మండల కేంద్రం మీదుగా దారి మళ్లించారు.

కూలీలు కష్టమే..

» పాత తరమే మిగిలింది.. » వ్యవసాయం పనులపై ఆసక్తి చూపని యువత » ఆయకట్టు వరి నాట్లలో జాప్యం» ఆందోళనలో రైతాంగం



నాటు వేస్తున్న మహిళలు



నా పేరు బత్తుల పెద్దులమ్మ.. మా ఊరు గొల్ల గోపాలపురం మాడ్గులపల్లి మండలం నాకు యాభై ఏళ్లు.. సుమారు 30ఏళ్లుగా వ్యవసాయ కూలీలమే ఫ్రీగా ఉన్నాను. ఒకప్పుడు మా గుంపులో సుమారు 40మంది వరకు ఉండే వారు. ఐదేళ్లుగా మా గుంపులో పది కంటే ఎక్కువ మంది పనులకు రావడం లేదు. అందరూ 40 నుంచి 70 ఏళ్ల వయస్సు ఉన్న పాతతరం వాళ్లే ఉన్నారు. ఇప్పటి పిల్లలందరూ చదువుకుంటున్నారు. వ్యవసాయ పనులకు రావడానికి ఆసక్తి చూపించడం లేదు. మా తర్వాత వ్యవసాయ పనులు చేసే వారు కనిపించడం లేదు.

(ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ (వ్యవసాయం)

పంటల సాగులో ఇప్పటికీ కూలీల వినియోగం పెరుగుతూనే ఉంది. నీటి వనరులు అభివృద్ధి చెందడంతో పంటల సాగు గణనీయంగా పెరిగింది. ప్రతి ఏటా వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రధానంగా ప్రస్తుత యువత చదువులపై దృష్టి సారించడంతో పాటు వ్యవసాయం వైపు మొగ్గుచూపడం లేదు. ప్రస్తుతం పాతతరం మాత్రమే మిగిలారు. యువతరం అంతా పల్లెలను వదిలి పట్టణాలకు వలస బాట పడుతున్నారు. ఏదో ఒక కొలువులో బతుకు సాగిస్తున్నారు. ఏ గ్రామంలో పరిశీలించినా యువత పది శాతం మించిలేదు.

మారిన ఆయకట్టు చిత్రం

నాగార్జునసాగర్ ఆయకట్టులో ఏడు దశాబ్దాలుగా వరి సాగు ప్రధాన పంటగా ఉంది. ఎడమ కాల్వ కు నీటి విడుదల చేసినప్పుడు ఒకే సారి వరి సాగు పనులు మొదలు పెట్టేవారు. వరి నాట్లకు కూలీల అవసరం చాలా ఉండేది. అప్పట్లో స్థానికంగా కూలీలు సరిపోయేవారు కాదు. సాగర్ ఆయకట్టుకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వందల సంఖ్యలో కూలీలు వరి నాట్లు, కోతల సమయంలో వచ్చే వారు. ప్రతీ గ్రామానికి పది నుంచి 20 గుంపులు (కూలీల సమూహం) వచ్చేవి. ఏనాడు కూలీల కొరత ఉండేది కాదు. సకాలంలో వరి నాట్లతో పాటు కోతలు, పంట నూర్పిడి పనులు పూర్తి చేసేవారు. 1995 వరకు కూలీల వలసలు సాగాయి. తర్వాతి కాలంలో మహబూబ్‌నగర్ ప్రాంతంలో నీటి వనరులు అభివృద్ధి చెందాయి. క్రమంగా కూలీల రాక ఆగిపోయింది. అప్పటి నుంచి స్థానికంగా ఉండే కూలీలపైనే ఆధార పడుతూ వస్తున్నారు. ఆశించిన స్థాయిలో కూలీల అందుబాటులో లేకపోవడంతో సాగులో జాప్యం జరుగుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెట్ట ప్రాంతాలు.. వరి సాగుతో...

సాగర్ ఆయకట్టులో ఎడమ కాల్వ పైభాగం (ఎడమ వైపు) చిన్నపాటి ఎత్తిపోతల మినహా నీటి పారుదల ఉండేది కాదు. బోరు బావుల ఆధారంగా పూర్తిస్థాయిలో మెట్ట పంటలైన బత్తాయి, పత్తి, కంది తదితర పంటలనే సాగు చేసేవాళ్లు. మెట్ట ప్రాంతాల కూలీలు సాగర్ ఆయకట్టులో వరి సాగు కూలీ పనులకు వచ్చే వాళ్లు. వరి పనులు పూర్తయ్యాక ఆయకట్టులో ఉన్న కూలీలు మెట్ట ప్రాంతాల పనులకు వెళ్లేవారు. తర్వాత మెట్ట ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంపు, పంటల సాగు, చెరువులు నింపేందుకు వరద కాల్వలు ఏర్పాటయ్యాయి. సాగర్ ప్రాజెక్టు నిండినప్పుడు ప్రధాన ఆయకట్టు తో పాటు వరద కాల్వలకు సాగు నీటిని విడుదల చేస్తున్నారు. నీరు పుష్కలంగా వస్తుండటంతో దశాబ్ద కాలంగా బోరు బావులు, చెరువులు కింద లక్షల ఎకరాల్లో మెట్ట పంటల స్థానంలో వరి సాగు చేపట్టారు. దీంతో కూలీల వలసలు ఆగిపోయాయి. స్థానికంగా ఉన్న కూలీలు సరిపోవడం లేదు.

రైతులకు యాంత్రీకరణపై అవగాహన

వరి సాగు గణనీయంగా పెరగడం, కూలీల సంఖ్య వేగంగా తగ్గడంతో భవిష్యత్తులో పంటల సాగు ప్రశ్నార్థకరంగా మారనుంది. చిన్నపాటి వరి నాటు యంత్రాలు, వివిధ పరికరాలు రాయితీపై రైతులకు అందజేస్తే కొంత మేరకు కూలీల కొరతను అధిగమించవచ్చని వ్యవసాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

వ్యవసాయం కష్టంగా ఉంది..



ఈ ఏడాది సకాలంలో సాగర్ కాల్వకు నీటి విడుదల జరిగినా వరి నాట్లకు కూలీలు కొరత ఏర్పడింది. ఒకేసారి పంటల సాగు ప్రారంభం కావడంతో పాటు స్థానికంగా కూలీలు లభ్యత లేకపోవడంతో చాలావరకు నార్లు ముదిరిపోయాయి. వేరే ప్రాంతాల నుంచి రవాణా చార్జీలు చెల్లించి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సారి ఎకరం నాటుకు తప్పని పరిస్థితిలో రూ.9వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. పంటల సాగు చాలా ఆలస్యమైంది. ప్రభుత్వం వరిలో యాంత్రీకరణను ప్రోత్సహించాలి.

- ప్రసాద్, రైతు, పనసయ్య క్యాంపు, నిడమనూరు

పంటల సాగు ఆలస్యంగా..

సాగర్ ఆయకట్టుతో పాటు జిల్లాలో మొత్తం పది లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. పది శాతం వరకు వరి సాగులో మెట్ట వరి, యంత్రంతో నాటే డ్రమ్ సీడర్, వెదజల్లడం వంటి ఆధునిక పద్ధతుల్లో వరి సాగు చేస్తున్నారు. చిన్న కమతాల కారణంగా మిగతా 90 శాతం మేర సంప్రదాయ పద్ధతిలోనే కూలీలతో వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ముందుగానే సాగర్‌లో నీటి ప్రవాహం ప్రారంభమవడంతో రైతులు ముందస్తుగానే వరినార్లు పోసుకున్నారు. జూలైలో నీటి విడుదల చేయడంతో బోరు బావులతో పాటు సాగర్ కాల్వ కింద ఒకే సారి వరి నాట్లు మొదలు పెట్టారు. దీంతో స్థానికంగా ఉన్న కూలీలు సరిపోక పూర్తి స్థాయిలో కొరత ఏర్పడింది. చాలా దూర ప్రాంతాలను నుంచి రవాణా చార్జీలు చెల్లించి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితి. సాధారణంగా ఎకరం వరి నాటుకు రూ.4 నుంచి 5 వేల వరకు కూలి అయ్యేది. ఈ సీజన్‌లో మా త్రం ఎకరానికి రూ.6వేల 9 వేల వరకు ఖర్చు చేశారు. పంటల సాగు ఆలస్యం కావడంతో తెగుళ్ల సమస్య పెరిగి దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

ఈ నెల 31న కుమ్మర సంఘం ఎన్నికలు

నార్కట్‌పల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుమ్మర సంఘం నార్కట్‌పల్లి మండల, పట్టణ శాఖలకు ఈ నెల 31వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు నిమ్మనగోటి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జీవీఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే ఎన్నికలకు మండలం నుంచి కుమ్మర సోదరులు హాజరై ఎన్నికల నిర్వహణకు సహకరించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు.

మండప నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

మర్రిగూడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున వినాయక మండపాల వద్ద నిర్వాహకులు విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దూది రాజు అన్నారు. మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడారు. రాత్రి సమయంలో నిర్వాహకులు మండపం వద్దే బస చేయాలని, దీపాలు వెలిగించేందుకు ప్రత్యేకమైన పెట్టెను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కొలువుదీరిన గణనాథులు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో గణపతి బప్ప మోరియా.. అంటూ డప్పుల వాయిద్యాలు బ్యాండ్ మేళాలతో యువత నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. చవితి వేడుకలతో జిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వినాయక చవితి రోజునే పలు మండపాల వద్ద వివిధ రాజకీయ ప్రముఖులు, అధికారులు పూజల్లో పాల్గొన్నారు. నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీతో పాటు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ శ్రీనివా‌స్‌రెడ్డి, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


నల్లగొండ పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో


చండూరులో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


శాలిగౌరారంలో కొలువైన గణనాథుడు


శివాజీనగర్‌లో....


కనగల్‌లో....




నల్లగొండలో పూజలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండ పట్టణంలోని బోయవాడలో భక్తుల పూజలు


నల్లగొండ పట్టణంలోని మల్లికార్జున కాలనీలో విగ్రహ ప్రతిష్ఠ

శాలిగౌరారంలో భారీ వర్షం

● *జలమయమైన లోతట్టు ప్రాంతాలు*

శాలిగౌరారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం రాత్రి నుంచి ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మంగళవారం రాత్రి 4 సెంటీమీటర్లు, బుధవారం 2 సెంటీమీటర్ల వర్షం కురిసిందని తహసీల్దార్ షేక్ జహీరుద్దీన్ తెలిపారు. వరి, పత్తి పంటలు అక్కడక్కడ వరద నీటిలో మునిగిపోయాయి. పలు రోడ్ల కల్వర్టుల మీద నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇప్పటికే మండలంలోని పలు చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. శాలిగౌరారం నుంచి ఊట్కూరు మాదారం వెళ్లే ఆర్‌బీ రోడ్డులో ఊట్కూరు వద్ద కాజువే పై భారీగా నీరు ప్రవహిస్తుంది.

వెల్మకన్నెకు బస్సు సౌకర్యం కల్పించాలి

గట్టుప్పల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ నుంచి వెల్మకన్నె గ్రామం మీదుగా చౌటుప్పల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో గురువారం సీపీఎం ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. 10 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వలు సరిగ్గా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయ కులు చాపల మారయ్య, నాయకులు టేకుమెట్ల కృష్ణ, పడసబోయిన యాదగిరి, అబ్బయ్య, అంజయ్య, గంగన్న, గోని మహేష్, సత్త య్య, లింగయ్య, నరసింహ, రాములు, లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటరు ముసాయిదా జాబితా ప్రదర్శన

చిట్యాలరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటరు ముసాయిదా జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. గురువారం చిట్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జయలక్ష్మి, మండలంలోని 18 గ్రామాల గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద పంచాయతీ కార్యదర్శులు నోటీస్ బోర్డుల వద్ద ప్రదర్శించారు. అభ్యంతరాలు సవరణకు ఈ నెల 30వ తేదీ వరకు సమాచారమివ్వాలని ఎంపీ డీవో, కార్యదర్శులు తెలిపారు. సెప్టెంబరు 2వ తేదీన ఓటరు తుది జాబితా రూపొందించబడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గంపల మనోహర్, మేక వెంకటేశ్వర్లు, మౌనిక, విజయ, సునీల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలంపాట డబ్బుల అందజేత


చెక్కు అందజేస్తున్న డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల, బీజేపీ నేత ప్రసాద్

నల్లగొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో గల మొదటి వినాయక విగ్రహం లడ్డుకు 2024లో జరిగిన వేలంపాటలో డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి రూ.13,50,000 లడ్డూను కైవసం చేసుకున్నారు. ఆ మొత్తానికి సంబంధించిన బ్యాంకు చెక్కును గురువారం వినాయక చవితి సందర్భంగా నిర్వాహకులకు అందజేశారు. ఈ డబ్బును శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం నిర్మాణం కోసం ఉపయోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరుగోని రాజయ్య, నాయకులు వేనేపల్లి లక్ష్మణ్ రావు, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, చింత హరిప్రసాద్, బొడ్డుపల్లి సతీష్, యాదగిరి, వెంకన్న, శేఖర్, శ్రీనివాస్, రఘు, లింగస్వామి, రాము, శ్రీను, దిలీఫ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

● *సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి*

కనగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మౌలిక వసతులు కరువై గ్రామాలు సమస్యల సుడిగుండంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. డ్రైనేజీ కాల్వల నిర్మాణం, సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగు నీటి సరఫరాను సక్రమంగా జరపాలన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

యూరియా కొరతను పరిష్కరించాలి

యూరియా కొరతను పరిష్కరించాలని గురువారం సీపీఎం నాయకులు ఏఓ అమరేందర్‌గౌడ్‌కు రైతు వేదికలో కలిసి వినతి పత్రం అందజేశారు. యూరియా బస్తాల కోసం రైతులు వ్యవసాయ పనులు వదులుకుని నిత్యం పీఏసీఎస్ కార్యాలయం వద్ద పడుగాపులు కాస్తున్నారని వివరించారు. అదును దాటితే దిగుబడులపై ప్రభావం ఉంటదన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ, ఎండీ.సలీం, మండల కార్యదర్శి కానుగులింగాస్వామి నాయకులు కందుల సైదులు, ఎస్‌కె.సుల్తానా తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి


కంకర రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి, రెండు సంవత్సరాలు కావస్తోందని, రోడ్డు విస్తరణలో కంకర పోసి వదిలేశారని, ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే నరక యాతన పడాల్సి వస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నర్సింగ్‌బట్ల గ్రామానికి వెళ్లే రోడ్డు విస్తరణ పనుల్లో కంకర వేసి వదిలిన రోడ్డు వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవనే సాకుతో రోడ్డు పనులు ఆపివేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం వెంటనే కాంట్రాక్టర్లను, అధికారులతో సమీక్షించి పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాక పోవడంతో నర్సింగ్‌బట్ల, తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు చుట్టూ తిరిగి రాములబండ, దోమలపల్లి గ్రామాల మీదుగా వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని, లేని ఎడల సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, పోలే సత్యనారయణ, వెంకన్న, రవిందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సింహ ఆశయ సాధనకోసం కృషి చేయాలి

చండూరురూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రజానాయకుడు అమరజీవి మాదగోని నర్సింహ పేదల గుండెల్లో నిలిచారని, ఆయన ఆశయ సాధనకోసం ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో ఉన్నటువంటి నర్సింహ స్మారక స్తూపానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఎర్రజెండా చేతపట్టి తుది శ్వాస వరకు ఆ నీడలోనే ఉంటూ, నమ్మిన సిద్ధాంతం కొరకు పాటుపడిన గొప్ప నాయకుడు నర్సన్న అని కొనియాడారు. చండూరు మండల కార్యదర్శిగా పనిచేస్తూ మండలంలో అన్ని గ్రామాలకు పార్టీని విస్తరించి, పార్టీ బలోపేతానికి కృషి చేశాడని, పేద ప్రజలకు ఇళ్లు, రేషన్‌కార్డులు ఇప్పించి వారి హక్కుల కోసం పోరాటాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్పనాయకుడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ, మాజీ జడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, సీపీఐ నాయకులు పల్లె యాదయ్య, తిప్పర్తి రాములు, దోటి వెంకన్న, కర్నాటి వెంకన్న, బండమీది వెంకటేశం, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య, మాజీ సర్పంచ్‌లు బోయపల్లి జంగయ్య, మాధగోని శ్రీశైలం, కాటపల్లి శ్రీను, కొండారెడ్డి సాయి, బోయపల్లి శివలింగయ్య, ఎస్.కె. హమీద్, జక్కుల పరమేశం, తదితరులు పాల్గొన్నారు.


నర్సింహ స్మారక స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అలుగులు పారుతున్న చెరువులు


అలుగు పారుతున్న కేతేపల్లి నిమ్మలమ్మ చెరువు

కేతేపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మూడు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజులుగా రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురుస్తుండగా పగటి పూట కాస్త తెరిపినిస్తుంది. వర్షపు నీటితో మండలంలోని వివిధ గ్రామాల చెరువులు, కుంటలు నిండుకుండల్లా ఆరి అలుగులు పోస్తున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పంటకు మరింత ముప్పు వాటిల్లనుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే అలుగు దునుకుతున్న చెరువులకు గురువారం ఎమ్మెల్యే వీరేశం గుడివాడ ఊర చెరువు వద్ద జలహారతి ఇచ్చి గంగమ్మ తల్లికి పూజలు చేశారు.

సమస్యలను పరిష్కరించడంలో విఫలం


రోడ్డుపై నాటు వేసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గట్టుప్పల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప అన్నారు. మండలంలోని అంతంపేట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం బురదమయమైన ప్రధాన రహదారిపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ అంతంపేట రహదారులు వర్షాలకు దెబ్బతిని గుంతలమయం గా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్లను బాగుచేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలివేరు దుర్గయ్య, జంపాల సుధాకర్, కం పె దుర్గయ్య, రాజు, శ్రీనివాసులు, వీరమల్ల రాజు, పి.భిక్షం, ఎం.భిక్షం, ఎం.రాజు, నరసింహ, లింగయ్య, శంకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌పీఎస్ దరఖాస్తులు స్వీకరించాలి

కేతేపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారి నుంచి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌పీఎస్) దరఖాస్తులు స్వీకరించాలని కేతేపల్లి తహసీల్దార్ రమాదేవి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కేతేపల్లి తహసీల్దార్ గురువారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 ఏప్రిల్ 1నుంచి 2025 ఆగస్టు 23లోపు మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం రూ.20వేలు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించిందన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు పెంచిన నేపథ్యంలో ఆయా గ్రామ పంచాయతీల ద్వారా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా లోపాలను గుర్తించాలి : చిరుమర్తి

నార్కట్‌పల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలోని లోపాలను గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, బీఆర్‌ఎస్ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు కాకుండా గ్రామస్థాయిలోని ప్రతీ నాయకుడు, కార్యకర్తలు పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి అభ్యంతరాలను చెప్పాలని అన్నారు.

దోబీఘాట్ నిర్మాణం పూర్తిచేయాలి


దోబీఘాట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో అసంపూర్తిగా ఉన్న దోబీఘాట్‌ను వెంటనే పూర్తి చేయాలని సీపీయం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. గురువారం అసంపూర్తిగా ఉన్న దోబీఘాట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ప్రారంభమైన దోబీఘాట్ నిర్మాణ పనులు సగం వరకే పూర్తయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి వెంటనే నిధులు విడుదల చేసి దోబీఘాట్ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఐతరాజు యాదయ్య, ఐతరాజు నర్సింహ, అక్కెనపల్లి నాగయ్య, పాలమాకుల అర్జున్, అమరోజు రాములు, గొలనుకొండ రాములు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సీపీఎంను గెలిపించాలి

కేతేపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని మాజీ జడ్పీటీసీ, ఆ పార్టీ సీనియర్ నాయకుడు బోళ్ల నర్సింహారెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో గురువారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి పోరాడే సీపీఎంకు ప్రజలు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు బొజ్జ చిన వెంకులు, నాయకులు లూర్దుమారయ్య, రాజు, జానకమ్మ, యాకోబు, ఎల్లయ్య, అయ్యన్న పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల వెతలు

కట్టంగూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని పీఏసీఎస్ వద్ద గురువారం ఎరువుల కోసం రైతులు బారులుతీరారు. కట్టంగూరు మండలానికి 444 యూరియా బస్తాలు రాగా రైతుల సాగు విస్తీర్ణాన్ని బట్టి రైతుకు రెండు నుంచి మూడు బస్తాలను అందజేసినట్లు అధికారులు తెలిపారు. యూరియా కోసం రైతులు అధిక సంఖ్యలో రావడంతో పోలీసుల పర్యవేక్షణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో గిరి ప్రసాద్, సీఈవో మల్లారెడ్డి, ఉన్నారు.

● నార్కట్‌పల్లి: సకాలంలో సరిపడినంత యూరియా దొరకక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా కోసం రైతులు కళ్లలో ఒత్తులు వేసుకుని మరీ ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో సరిపడా యూరియా రాక అందరికీ లభించక రైతులు ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు. తనకు యూరియా బస్తా ఇవ్వకుంటే మోనో తాగి చస్తానంటూ ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేయడం రైతుల ఆవేదనకు అద్దం పడుతోంది. మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వృద్ధ రైతు ఇంద్రకం నర్సింహ అధికారులపై ఆగ్రహం తీవ్ర వ్యక్తం చేశాడు. రైతు ఎకరానికి ఒక బస్తా గురువారం ఎల్లారెడ్డిగూడెం పీఏసీఎస్‌కు ఓ లారీ లోడు 444 బస్తాల యూరియా దిగుమతి అయ్యింది. సమాచారం అందుకున్న రైతులు అధిక సంఖ్యలో రైతువేదిక వద్దకు చేరుకున్నారు. యూరియా కోసం ఎగబడ్డారు. దీంతో ఇంద్రకంటి నర్సింహ అనే రైతు వద్దకు సీరియల్ వచ్చే సరికి యూరియా అయిపోయిందని పీఏసీఎస్ సిబ్బంది చెప్పారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన నర్సింహ తాను 4 ఎకరాలు వరి సాగు చేస్తే ఒక బస్తా కూడా యూరియా ఇవ్వలేదు. యూరియా ఇప్పుడు ఇవ్వకుంటే ఎప్పుడు పొలానికి చల్లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

● మునుగోడు: మునుగోడు పీఏసీఎస్‌కు గురువారం 444 బస్తాల లారీ లోడ్ వచ్చింది. దీంతో రైతులు ఉదయాన్నే వచ్చి వందల సంఖ్యలో బారులు తీరారు. సంబంధిత నిర్వాకులు నిల్వ ఉన్న యూరియాను ఒక్కో రైతుకు రెండు బస్తాల లెక్కన పంపిణీ చేశారు. అయినా ఇంకొంత మంది రైతులు మిగిలిపోయారు. అధికారులు రైతుల అవసరం మేరకు యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు.


మునుగోడులోబారులుదీరిన రైతులు


గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే వీరేశం



గుడివాడలో గ్రామ పంచాయతీ భవననిర్మాణ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల ను అన్ని రంగాల్లో అభివృద్ధిఓకి తీసుకురావడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంద ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆయన గురువారం కేతేపల్లి మండలంలోని గుడివాడ, కాసనగోడు గ్రామా ల్లో 54.50లక్షల వ్యయం తో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. పల్లెసీమల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ నమ్ముతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపా రు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన ప్రజలను కోరా రు. ఆయా కార్యక్రమాల్లో నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, తహసీల్దార్ రమా దేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్, ఎంపీవో నాగలక్ష్మి, ఎస్‌కె.లతీప్, కె.శ్రీనివాసయాదవ్, కోట మల్లికార్జున రావు, పి.ఇందిర, మాధవరెడ్డి, బి.సుందర్, జి.ప్రభాకర్, పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.0
కనిష్ఠం 20.4
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 29 ఆగస్టు 2025




సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు లైన్‌క్లియర్ అయింది. సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులపై హైకోర్టు విధించిన స్టేను తాజాగా ఎత్తివేసింది. భూభారతి చట్టం ప్రకారం సాదాబైనామా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సూచించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు లైన్‌క్లియర్!

» స్టే ఎత్తివేసిన హైకోర్టు
» భూభారతిచట్టం ద్వారా రిజిస్ట్రేషన్లు
» విధివిధానాలు వచ్చాక ప్రక్రియ షురూ
» ఉమ్మడి జిల్లాలో 1.60లక్షలకు పైగా దరఖాస్తులు



జిల్లా	రెవెన్యూ గ్రామాలు	సాదాబైనామా దరఖాస్తులు
నల్లగొండ	565	82,134
సూర్యాపేట	486	45,219
యాదాద్రి	321	32,910
మొత్తం	1,372	1,60,263

భూభారతి చట్టంలోని సెక్షన్-6 ప్రకారం సాదాబైనామాలకు రిజిస్ట్రేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి దాఖలైందని కోర్టు స్పష్టం చేయడంతో ఇక వీటి రిజిస్ట్రేషన్లు ఊపందుకోనున్నాయి. కోర్టు కేసు తేలిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు 9,26,000 సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని, అర్హులైనవారికి పట్టాలు సైతం అందిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలోనే ప్రకటించారు. తాజాగా, కోర్టు తీర్పు అందుకు అనుకూలంగా రావడంతో సా దాబైనామాల దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భూమి మోఖాపై ఉన్న ప్రతీ రైతుకు, న్యాయబద్ధంగా సాదా బైనామా ఉంటే పట్టా ఇస్తామని ప్రభుత్వం స్పష్టంగా తేల్చిచెప్పింది.

ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు

గ్రామీణ ప్రాంత భూముల వివాదాల్లో కీలకమైన సాదాబైనామా రిజిస్ట్రేషన్లకూ తాజాగా కోర్టు తీర్పుతో మోక్షం కలగనుంది. వాస్తవానికి భూభారతి అమల్లోకి వచ్చిన వెంటనే ఆర్డీవోల ద్వారా సాదాబైనామాల పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమయినా కోర్టులో స్టే ఉండడంతో దరఖాస్తులు మాత్రమే స్వీకరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ధరణి చట్టం అమల్లోకి తెచ్చే క్రమంలో సాదాబైనామాలకు అవకాశం కల్పిస్తూ దరఖాస్తులు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ తేదీ జూన్ 2కి ముందు 12ఏళ్ల పాటు భూమిపై మోఖాలో ఉండి, పట్టాలేని రైతులు సాదాబైనామాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అప్పట్లో సూచించారు. 2020, అక్టోబరు 12 నుంచి 2020, నవంబరు 11 వరకు సాదాబైనామాల రిజిస్ట్రేషన్ల నిమిత్తం దరఖాస్తులు తీసుకున్నారు. అప్పుడు 2002 నుంచి 2014 వరకు సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన చిన్న, సన్నకారు రైతులంతా దరఖాస్తు చేసుకున్నారు. ధరణి చట్టం ద్వారానే వీరికి పట్టాలివ్వాలని భావించినా అప్పటి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా, భూభారతి అమల్లోకి తెచ్చేసమయంలోనూ సాదాబైనామాలపై రైతుల నుంచి భారీగా విజ్ఞప్తులు రావడం, రెవెన్యూరంగ నిపుణులు, రిటైర్డ్ అధికారులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులకు సాదాబైనామాల రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఇబ్బందులు

- మిగతా 6వ పేజీలో...

● జై బోలో గణేశ్ మహారాజ్‌కీ...



వినాయక చవితి సందర్భంగా జిల్లా కేంద్రం సావర్కర్ నగర్‌లో కొలువుదీరిన గణనాథుడు

● పొంగిపొర్లిన చెరువులు



శాలిగౌరారం-ఊట్కూరు గ్రామాల మధ్య కాజ్‌వేపై ప్రమాదభరితంగా ప్రవహిస్తున్న వరద

8

కుర్చీలో కూర్చునేదెట్లా?

» పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీకాలం పెంపునకు బ్రేక్
» సొసైటీ చైర్మన్ల చెక్‌పవర్ సైతం నిలిపివేత
» ఒక్క డీసీసీబీ చైర్మన్ కుంభంకే ప్రభుత్వం అనుమతి
» సొసైటీల్లో సీఈవోల బదిలీలపైనా గందరగోళం

నల్లగొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల గడువుపై ప్రభుత్వం విచిత్ర జీవోను జారీ చేసింది. ఈనెల 14వ తేదీతో పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీకాలంతో పాటు డీసీసీబీల పాలకవర్గాల గడువును ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం జీవో 386, జీవో 74ను విడుదల చేసింది. దీని ప్రకారం మరో ఆరు నెలల పాటు గడువు పెరిగిందని పీఏసీఎస్ చైర్మన్లు, డీసీసీబీ డైరెక్టర్లు భావించారు. విచిత్రంగా పీఏసీఎస్ చైర్మన్ల గడువు పెంపుపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఈ మేరకు సొసైటీల గడువు పెంచకుండా జిల్లా సహకార అధికారులను నిలువరిచింది. అయితే రాష్ట్రంలోని మిగతా డీసీసీబీ చైర్మన్లతో పాటు ఉమ్మడి జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే చైర్మన్‌గా కొనసాగేలా అనుమతి ఇచ్చింది. ఉమ్మడిజిల్లాలోని 108పీఏసీఎస్‌లలో 107పీఏసీఎస్ చైర్మన్లతోపాటు ఆయా పాలకవర్గాల సభ్యుల పదవీ కాలం పొడిగించలేదు. డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైన పీఏసీఎస్‌కు గడువు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వగా,మిగతా పీఏసీఎస్‌ల చైర్మన్లు, సభ్యుల పదవుల గడువు పెం పును నిలిపివేశారు.దీంతో గందగోళ పరిస్థితులు నెలకొన్నాయి.డీసీసీబీలో ఒక్కచైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే ఉండటానికి ఉత్తర్వులు ఉండగా, 17మంది డీసీసీబీ డైరెక్టర్‌లతో పాటు మరో ఇద్దరు ప్రొఫెషనల్ డైరెక్టర్లు పదవులు లేనట్టే. ప్రస్తుత నిబంధనల మేరకు వారంతా మాజీలుగానే మిగిలారు.



చెక్ పవర్ నిలిపివేత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునుగోడు సొసైటీ మినహా మిగతా 107 సొసైటీల చైర్మన్లను మాజీలుగా భావిస్తూ వారి చెక్ పవర్‌లను ప్రభుత్వం నిలిపివేసింది. పదవీకాలం పెంపును నిలిపివేసిన విషయం ఆయా సొసైటీల చైర్మన్లు గోప్యంగా ఉంచుతూ ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. అయితే జిల్లా సహకార అధికారి మాత్రం ప్రభుత్వం ఆదేశాల మేరకు వారి చెక్‌పవర్‌ను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల పాలకవర్గాన్ని పెంచకుండా నిలిపివేయడానికి కారణాలు ఏమిటనేది తెలియక చైర్మన్లు గందరగోళంలోపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి

- మిగతా 6వ పేజీలో...

అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా లావణ్యరాణి



బాధ్యతలు స్వీకరించిన జడ్జి లావణ్యారాణికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు


మిర్యాలగూడ లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఎం.లావణ్యరాణి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆమెకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సాయికుమార్, కర్నం లింగయ్య, గంగాభవాని, సుండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులతో గౌరవంగా మెలగాలన్నారు. కుక్క, పాము కాటుకు ఇచ్చే మందులను పరిశీలించారు. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించి రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి, కేస రవి, మండల వైద్యాధికారులు శ్రీదేవి ఇక్బాల్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ అమరుల స్ఫూర్తితో పోరాటాలు



విద్యుత్ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. గురువారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో విద్యుత్ పోరాట అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచగా, వాటిని ఉపసంహరించుకోవాలని చేసిన పోరాటంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ పోరాట పర్యవసాన మే ఆ తరువాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్‌ను ప్రకటించిందన్నారు. ప్రజా పోరాటాలను అణచాలనుకున్న ప్రభుత్వాలు అంతమవుతాయని అన్నారు. నాటి అమరుల స్ఫూర్తితో నేడు విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్రం ఆధీనంలోకి తీసుకోవాలని చేస్తున్న ప్రయత్నాలను సంఘటితంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుచ్చకాయల నర్సిరెడ్డి, మల్లం మహేష్, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, గాదె నరసింహ, గుండాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోలు పాఠశాలల తనిఖీని పెంచాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల తనిఖీల సంఖ్య పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఎంఈవోలు పాఠశాలలను తనిఖీచేస్తూ విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మంజూరైన పనుల పురోగతిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు.



జ్యోతిని వెలిగించి క్రీడోత్సవ రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డేటా సేకరణలో వేగం పెంచాలి

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం డేటా సేకరణ, దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. 2017 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 33,600 మరణాలు సంభవించగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి 3,121దరఖాస్తులు వచ్చాయన్నారు. చండూరు డివిజన్‌లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని అధికారులను అభినందించారు.

క్రీడలపై ఆసక్తి కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కల్చరల్): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తిని లక్ష్మారెడ్డితో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడోత్సవ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, డీఈవో భిక్షపతి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, డీవైఎస్‌వో అలీ, కర్తయ్య, యూనస్, డీపీవో వెంకయ్య, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతిపై అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): నార్కట్‌పల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ ఇలా త్రిపాఠి అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం నార్కట్‌పల్లిలోని ఎంపీడీవో, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీవో కే.ఉమేశ్‌చారిని ప్రశ్నించారు. పురోగతి ఆశించిన మేర లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ఉన్నారు.

దరఖాస్తులను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం శాలిగౌరారం నుంచి ఊట్కూరు వెళ్లే రహదారిలో లోలెవెల్ కాజ్‌వేను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ జమీరుద్దీన్ ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

రైతుసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్రం వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యంతో సకాలంలో యూరియా సరఫరా చేయకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాట్లు వేసిన 15-20 రోజుల్లో యూరియా వినియోగించాల్సి ఉండగా, మార్కెట్లో కొరతతో రైతులు పొలాలు వదిలి దుకాణాల ఎదుట క్యూకడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాట్లు పూర్తయి నెలగడుస్తున్నా యూరియా చల్లక, పంట ఎదుగుదల లోపిస్తోందని అన్నారు. పొద్దంతా లైన్‌లో నిలబడితే రెండు బస్తాల యూరియా కూడా దొరకడం లేదని, ఐదు ఎకరాలు ఉన్న రైతు ఎన్ని రోజులు లైన్లలో నిలబడాలని ప్రశ్నించారు. యూరియా కొరతతో రైతులు పడుతున్న అగచాట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిల్ల కనకయ్య, నాయకులు ఎర్రబోతు పద్మ, అంజన్న, ఎండి.సయ్యద్, పోలేపల్లి ఉదయ్‌కుమార్, షమీం, గువ్వల మట్టయ్య, మందడి కృష్ణారెడ్డి, రామలింగయ్య, వెంకట్‌నారాయణ, బుచ్చిబాబు, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీజీసీపీఎస్ నాయకులు

టీజీసీపీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామదాసు

నల్లగొండ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సెప్టెంబరు 1న చేపట్టనున్న సీపీఎస్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని టీజీసీపీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శిరందాసు రామదాసు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించి ఎన్జీ కళాశాలలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004 సెప్టెంబరు 1 తరువాత నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధన కోసం సెప్టెంబరు 1న సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే ఆత్మగౌరవ సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనస్, సుధాకర్, అనిల్, గౌస్ పాల్గొన్నారు.

● బుద్ధవనంలో విదేశీయులు



నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని సందర్శించిన 23 దేశాల ప్రతినిధులు

7

సాగర్ ఎడమకాల్వకు

నీటి విడుదల నిలిపివేత

● మూసీ 8 క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల 7

● డిండి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

నేడు డిండిలో ఎమ్మెల్యే బాలు నాయక్ మార్నింగ్‌వాక్

డిండి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే బాలు నాయక్ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో పాల్గొంటారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలు నేరుగా అడిగి ఎమ్మెల్యే తెలుసుకుంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు : ఎస్ఐ

నేరేడుగొమ్ము, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నాగేంద్రబాబు హెచ్చరించారు. మండలంలోని కొత్తపల్లి, వైజాగ్‌కాలనీలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో నేరేడుగొమ్ము పోలీసులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ పట్టణంలోని గణేశ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీఎస్పీ రాజశేఖరరాజు తదితరులు



దేవరకొండ పట్టణంలోని పాత రామాలయంలో వినాయక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో గణపతి బప్ప మోరియా.. అంటూ డప్పుల వాయిద్యాలు బ్యాండ్ మేళాలతో యువత నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. చవితి వేడుకలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు నిర్వహించనున్నారు. వినాయక చవితి రోజునే పలు మండపాల వద్ద ఎమ్మెల్యేలు బాలు నాయక్, బీఎల్ఆర్, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పూజల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు.



గుడిపల్లిలో గణనాథుడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



చింతపల్లి : వీ.టీనగర్‌లో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు



దామరచర్ల మండలం కేజేఆర్ కాలనీలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శంకరనాయక్ దంపతులు



కొండమల్లేపల్లి ఇంద్రపురం కాలనీలో ..



మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేటలో మట్టి గణపతి భారీ విగ్రహానికి పూజ చేస్తున్న భక్తులు

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

దామరచర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డ్రైనేజీల్లో, చెత్త పేరుకపోయి అధ్వానంగా ఉన్నాయన్నారు. మండల వైద్యాధికారి అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపానాయక్, ఎర్రనాయక్, దయానంద్, శ్రీను, సుభాని, విజయ్, బాలు పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట అమరులకు నివాళి



అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నాడు బషీర్‌బాగ్‌లో విద్యుత్ కోసం పోరాడి అమరులైన వారి త్యాగఫలితంగానే నేడు ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తోందని సీపీఎం, సీపీఐ రాష్ట్రకమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ అమరులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామికినివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 9 వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సుమారు 100 రోజుల పాటు నడిచిన ఉద్యమం ఉమ్మడి రాష్ట్రం లో ప్రతీ గడపను తాకిందన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభుడు వస్కుల మట్టయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు నూకల జగదీశ్ చంద్ర, మల్లు గౌతంరెడ్డి, గాదె పద్మ, జిల్లా కనకయ్య, కాశీం, కిరణ్, పిల్లుట్ల సైదులు, కరీమున్నీసా, మాధవరెడ్డి, అరుణ, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

దేవరకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదలయ్యేలా చూడాలని ఏబీవీపీ దేవరకొండ నగరశాఖ ఆధ్వర్యంలో వినాయకుడికిశుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం విభాగ్ హాస్టల్స్ జిల్లా ఇన్‌చార్జి యనమల గోపింద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చత్రపతి చౌహాన్ మాట్లాడుతూ ప్రభుత్వం రూ.8,500 కోట్లు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతుందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసేలా ప్రభుత్వం చూడాలని వినాయకునికి వినతిపత్రం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు హేమసుందర్, ఈశ్వర్, మనోజ్ పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం

కొండమల్లేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో గర్భిణి 108లోనే ప్రసవించింది. ఈ సంఘటన కొండమల్లేపల్లి కేంద్రంలో బుధవారం తెల్లవారు జామున జరి గింది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన ఐతపాక అన్నపూర్ణకి పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. వెంటనే ఈఎంటీ ఎల్లయ్య, పైలెట్ వెంకటేష్ దేవరకొండలోని ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికం కావడంతో ఈఎంటి ఎల్లయ్య ఫోన్‌లో డాక్టర్ మౌనిక సూచనల ప్రకారం వైద్యం అందించి గర్భిణికి సుఖ ప్రసవం అయ్యేలా చూశారు. ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



శిశువును మహిళ కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సిబ్బంది

అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రజా పాలన

కొండమల్లేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమం దిశగా ప్రజా పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మార్నింగ్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పలు కాలనీల్లో అధికారులు, నాయకులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించడమే లక్ష్యమని, కాంగ్రెస్ ప్రభు త్వం పేదల కోసం పని చేస్తుందని అన్నారు. మండల కేంద్రంలో దాదాపు రూ.1.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఎమ్మెల్యే పరిశీలించారు. నల్లగొండ రోడ్డులో గల హనుమాన్‌నగర్(పాత ఊరు) లో ఓ మహిళ గతేడాది తన భర్త చనిపోయాడని ఇందిరమ్మ ఇంటిని ఇప్పించాలని ఎమ్మెల్యేను వేడుకున్నది. వెం టనే అధికారులతో మాట్లాడి ఆ ఒంటరి మహిళకు ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే మహిళలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తు చేసుకునేలా చూడాలని తహసీల్దార్ నరేందర్‌కుసూచించారు.

బురదలోనే నడుచుకుంటూ

మండలకేంద్రంలో హైదరాబాద్ రోడ్డులోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో వర్షాలు వచ్చినప్పుడల్లా కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చినప్పుడు రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని ఎవరికీ చెప్పినా మా గోస పట్టించుకోవడం లేదంటూ బురద రోడ్లపై నడవలేకపోతున్నామని, ఇప్పటికైన మా కాలనీలో సీసీ రోడ్లు వేయించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. అలాగే అంబేడ్కర్ నగర్ కాలనీలో రూ.30లక్షలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమి టీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, ఎంఏక్రైసర్‌ఖాన్, మేకల శ్రీనివాస్‌యాదవ్, నజీర్‌మౌలానా, కుంభం శ్రీనివాస్‌గౌడ్, గంధం సురేష్, కొనిదాల వెంకటయ్య, కోట్ల జగదీశ్, బూడిద మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ నగర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ జాగృతి నియోజకవర్గ కన్వీనర్ కర్ణకంటి రజనీకాంత్ గురువారం ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ లైన్ మార్చాలి

చింతపల్లి : మండలంలోని తీదేడులో 11 కేవీ విద్యుతు లైన్ షిఫ్టింగ్ చేయాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు గ్రామస్థులు వినతి పత్రం అందించారు. సుమారు 100 ఏళ్ల నుంచి నివాస గృహలపై 11 కేవీ లైన్ ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. వెంటనే లైన్ తొలగించి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, శివర్ల శంకర్, ముద్రు రంగారావు, వెంకటయ్య పాల్గొన్నారు.

పెద్దవూర పంచాయతీ అధికారిగా మంగతాయారు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీవో

పెద్దవూర, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పెద్దవూర మండల పంచాయతీ అధికారిగా పి.మంగతాయారు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా మూడుచింతల మండలం నుంచి ఆన్‌డ్యూటీగా ఆమె వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఎంపీడీవో ఉమాదేవి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వెంకట్‌రెడ్డికి నివాళి

డిండి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరి నెమలిపూర్ గ్రామ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త డాక్టర్ గంగిడి వెంకట్‌రెడ్డి బుధవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ వెంకట్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట రాజినేని వెంకటేశ్వరరావు, ప్రశాంత్‌రావు, ఎండీ.జహంగీర్, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం : తుమ్మల

దేవరకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులతో కుమ్మక్కై కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సీఐటీయూ 13వ జిల్లా మహాసభల సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండలో సీఐటీయూ జిల్లా మహాసభలను త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో 200 మందితో ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు.సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, నల్ల వెంకటయ్య, కంభాలపల్లి ఆనంద్, నాగరాజు, బిజిలి లింగయ్య, యాదగిరి, జ్యోతి, శైలజ, బుడిగ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి అన్నారు. పట్టణంలోని పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డులో బురద నీటిలో నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు మాట్లాడుతూ హౌజింగ్‌బోర్డు, తాళ్లగడ్డ, రంగన్న కాలనీ, హనుమాన్‌పేట తదితర కాలనీలలో వర్షపు నీరు నిలిచి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మురుగు నీరు రహదారుల్లో ప్రవహిస్తోందని, దోమలు, పందుల వ్యాప్తి పెరిగిందన్నారు. పలు కాలనీల్లో వీధి దీపాలు వెలుగకపోవడంతో చీమ్మచీకట్లు కుమ్ముకుంటుండగా, మరికొన్ని కాలనీలలో రేయింబవళ్లు వీధి లైట్లు వెలుగుతున్నాయన్నారు. పురపాలకులు ప్రచారానికే పరిమితమయ్యారని, వంద రోజుల ప్రణాళికలో ఎలాంటి పనులు చేయలేదన్నారు. కార్యక్రమంలో అరుణ, మణెమ్మ, మున్నీ, వెంకటరెడ్డి, కరీమున్నీసా, ప్రమీల, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బురద నీటిలో నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



వేములపల్లి : లక్ష్మీదేవిగూడెం గ్రామ శివారులో నీట మునిగిన లోలెవల్ వంతెన

వేములపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చిత్రపరక వాగు, లక్ష్మీదేవిగూడెం బందానికి వరద పోటెత్తింది. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురయ్యారు. చిత్రపరక వాగుకు పైన ఉన్న గొలుసుకట్టు చెరువులకు వరద వచ్చి చేరుతుండడంతో శెట్టిపాలెం శివారులో చిత్రపరక వాగు బ్రిడ్జి వెంట గల లోతట్టు వరి పొలాలు నీట మునిగాయి. అలాగే ఆమనగల్లు చెరువుకు మూసీ కాల్వ నుంచి వరద వచ్చి చేరడంతో చెరువు అలుగుపోస్తుంది. దీంతో లక్ష్మీదేవిగూడెం గ్రామ శివారులోని బందానికి వరద వచ్చి చేరుతుండడంతో లోలెవల్ వంతెన నీట మునిగింది. భీమారం- సూర్యాపేట రహదారిపై రాకపోకలు కొనసాగించే వాహనదారుల ఇబ్బందులకు గురవుతున్నారు.

● మాడ్గులపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాలేరువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. ఆగామోత్కూర్, చిరుమర్తి, బొమ్మకల్, కల్వలపాలెం చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో భూగర్భజలాలు పెరగడంతోపాటు వ్యవసాయ పంటలకు అనుకూలంగా మారిందని రైతులు ఆశాజనకంగా ఉన్నారు.

గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శన

పెద్దవూర, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 28 గ్రామపంచాయతీల నూతన ఓటర్ల జాబితాను, పోలింగ్‌స్టేషన్ల జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో ఉమాదేవి విడుదల చేసి మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన సంగారం, మల్లెవానికుంట గ్రామ పంచాయతీలతోపాటు మొత్తం 28 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఫొటోలతో కూడిన వార్డులవారీగా రూపొందించిన ఓటర్ జా బితాలను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణ ఈనెల 30న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోని సవరణలతో కూడిన ఓటరు జాబితాను తదుపరి రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మంగతాయారు, సూపరింటెండెంట్ హఫీస్, పంకజ్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంతోపాటు ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద వార్డుల వారీగా ఓటరు లిస్టును ప్రదర్శించినట్లు ఎంపీడీవో మాతంగి రమేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు లిస్టును విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 28 నుంచి 30 వరకు డ్రాఫ్ట్ ఓటరు లిస్ట్‌లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

» హై లెవల్ కల్వర్టును నిర్మించరూ..



రాయినిగూడెంలో లెవల్ కల్వర్టుపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

చింతపల్లి మండలంలోని రాయినిగూడెం వర్కాల గ్రామాలను కలుపుతూ రోడ్డుపై నాలుగు వాగులు ఉన్నా యి. కురుస్తున్న వర్షాలకు వాగులు పూ ర్తిగా నిండి రహదారిపై వాగులో నుంచి వరదనీరు భారీగా ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డు గుండా మూడు మండలాలను కలిపి లింకు రోడ్డు ఉండటం వల్ల వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి హై లెవల్ కల్వర్టును ఏర్పాటు చేసి సమస్య పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి,)

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహావతార్ నరసింహ రాఘువ: కూలీ, విత్రోస్: కూలీ, వార్-2,కింగ్‌డమ్ దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : కూలీ